ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 11 మే 2024 | 3



ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో మీ భవిష్యత్తు, మీ బిడ్డల భవిష్యత్తుకు ఆలోచించి ఓటు వేయాలి. నా కష్టం, నా శ్రమ అంతా మీ, మీ బిడ్డల భవిష్యత్తు కోసమే.. మీ ఆశీస్సుల కోసం వచ్చా.. ఓటు వేసి ఆశీర్వదించండి. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు మీ ఓటు కీలకం.

ఆలోచించి.. ఓటేయండి!



జన..సేనుడు : రోడ్ షో, బహిరంగ సభకు వెల్లువలా తరలివచ్చిన జనం





నాకిది చాలన్నా : పవన్ వద్దకు రాగానే అంధురాలి ఆనందం





హత్తుకున్న పవన్ అభిమానం..

ఆంధ్రప్రదేశ్ దశ దిశ మార్చే ఎన్నికలివి..

- పిఠాపురాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతా
- ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ చేస్తా
- పురుషోత్తపట్నం వినియోగంలోకి తెస్తా
- సెజ్‌లో పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి
- ఉప్పాడ-కాకినాడ బీచ్‌ను అభివృద్ధి చేస్తా
- పిఠాపురం వారాహి సభలో పవన్‌కల్యాణ్

పిఠాపురం, మే 10: ఏపీ దశ దిశ మార్చే ఎన్నికలు ఇవి.. 25 ఏళ్ల ఏపీ భవిష్యత్తుకు మొదటి బీజం దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురాన్నే పడుతుంది..మోడల్ నియోజకవర్గంగా పిఠాపురాన్ని తీర్చిదిద్దుతా..అభివృద్ధి అంటే పిఠాపురంలా ఉండాలని, పార్లమెంట్ అంటే కాకినాడ లోక్‌సభ నియోజకవర్గంలా ఉండాలని దేశం మొత్తం ఇటు వైపు చూసేలా చేస్తానని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు.పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్ బంగారమ్మ రావిచెట్టు వద్ద శుక్రవారం రాత్రి జరిగిన వారాహి బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అద్భుతమైన పిఠాపురంగా తయారు చేయాలన్నదే తన ధ్యేయమన్నారు. పిఠాపురం పట్టణానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తామని, ఉప్పాడ రైల్వే గేటు వద్ద ఆర్వోబీ నిర్మాణం చేపట్టే బాధ్యత తాను తీసుకుంటానని తెలిపారు. పిఠాపురంలో విద్యుత్ వైర్లు బయటకు వేలాడుతూ కనిపిస్తున్నాయని..అవి బయటకు కనబడకుండా చేసే ఆలోచన చేస్తానని చెప్పారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ సహకారంతో ఏలేరు, సుద్దగడ్డ, పీబీసీ ఆధునికీకరణతో పాటు పురుషోత్తపట్టణం ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తెస్తామని తెలిపారు. నియోజకవర్గంలో సాగు,తాగునీటి సమస్యలు పరిష్కరిస్తామని, ప్రతి మండలంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తామని చెప్పారు. ఉప్పాడ నుంచి కాకినాడ వరకూ బీచ్ అభివృద్ధి చేసి దేశంలోని ప్రజలంతా ఇక్కడకు వచ్చేలా చేస్తామని తెలిపారు. కాకినాడ సెజ్‌లో 8 వేల ఎకరాలు సేకరించి ఇంకా పలువురు రైతులకు పరిహారం ఇవ్వలేదని, ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేదని, ఒక్క పరిశ్రమ తీసుకురాలేకపోయారని విమర్శించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సెజ్‌లో పరిశ్రమలు తీసుకువచ్చి పిఠాపురంతో పాటు కాకినాడ జిల్లా యువతకు ఇక్కడ ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. తనకు మద్దతుగా సాయిధరమ్‌తేజ్ ప్రచారానికి వస్తే అతడిపై వైసీపీ గూండాలు డ్రింక్ బాటిల్‌తో దాడి చేశారని, అది తగిలి తెలుగుదేశం తమ్ముడు నల్లల శ్రీధర్‌కు తీవ్ర గాయాలయ్యాయని..అతడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని తెలిపారు. వైసీపీ గూండాలను తాను హెచ్చరిస్తున్నానని..రాబోయే కూటమి ప్రభుత్వంలో వారికి తగిన శాస్తి చేస్తామని చెప్పారు. కులాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయం చేసేవాడిని కానని స్పష్టం చేశారు. పిఠాపురంలో తాను ఎందుకు నిలబడ్డానో తెలుసుకునేందుకు మే 13న ఇక్కడకు రావాలని తన భార్యను కోరినట్టు తెలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి అనేది కనిపించకుండా చేశారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ విమర్శించారు. ఐదేళ్లపాటు ఏనాడూ ప్రజలకు కనిపించని వంగా గీత నేడు ఎన్నికల వేళ ప్రజల ముందుకు వచ్చిందని ఎద్దేవా చేశారు. గీతకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్మ తనయుడు గిరీష్ వర్మ, జనసేన నాయకులు కడారి తమ్మయ్యనాయుడు పాల్గొన్నారు.

నెం 4పై నొక్కండి..

పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న తనకు చతుర్ముఖ బ్రహ్మలా బ్యాలెట్‌లో నాలుగో నెంబరులో ఉన్న గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేయాలని, కాకినాడ ఎంపీగా పోటీ చేస్తున్న తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కు తొమ్మిదో నెంబరులో ఉన్న గ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఉప్పొంగిన జనం..

పిఠాపురం/గొల్లప్రోలు/పిఠాపురం రూరల్/గొల్లప్రోలు రూరల్, మే 10 : జనకెరటం ఉప్పొంగింది. రహదారులన్నీ జాతరను తలపించాయి.ప్రజలు ఉప్పెనలా తరలివచ్చి పవన్‌కు నీరాజనాలు పలికారు. మహిళలు పూల వర్షం కురిపించి హారతులిచ్చారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ శుక్రవారం నిర్వహించిన రోడ్‌షోకు అపూర్వ స్పందన లభించింది. ఆర్వోబీ మీదుగా పిఠాపురం మండల పరిషత్ కార్యాలయం పక్క రోడ్డు నుంచి జగ్గయ్యచెరువు కాలనీ, పశువుల ఆస్పత్రి, అపార్ట్‌మెంట్లు, సామర్లకోట రోడ్డు, పాదగయ జంక్షన్ వరకూ రోడ్ షో సాగింది. సమయాభావంతో బైపాస్ రోడ్ మీదుగా పవన్ గొల్లప్రోలు చేరుకోగా పట్టణ రహదారులన్నీ జనసంద్రమయ్యాయి. పుర కార్యాలయం సెంటర్‌లో మహిళలు బెలూన్లతో స్వాగతం పలికారు. పలుచోట్ల చిన్నారులను ఎత్తుకున్నారు. చేబ్రోలు శివాలయం, మల్లవరం సెంటర్ మీదుగా ఏకే మల్లవరం, ఏపీ మల్లవరం గ్రామాల్లో రోడ్‌షో కొనసాగించారు. కొత్తపల్లి మండలంలో రోడ్‌షో కొనసాగింది. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన కొమ్మూరి గంగాధర్ తాను ల్యాండ్ టైటిలింగ్ చట్టానికి బాధితుడనని తెలుపుతూ చిత్రాడలో ప్లకార్డు ప్రదర్శించగా పవన్‌కల్యాణ్ స్పందించి ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని తెలిపారు.

6 గంటలు ఆలస్యంగా..

ఇదే టీమ్ : పవన్, శ్రీనివాస్, వర్మ అభివాదం

ఉదయం 9 గంటలకు రోడ్‌షో ప్రారంభమవుతుందని ముందుగా చెప్పినప్పటికీ ఆరు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది.ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురవడంతో హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అనుమతులు రావడంలో జాప్యం జరిగింది. దీంతో ఉదయం 10 గంటలకు గొల్లప్రోలు హెలిపాడ్‌కు రావాల్సిన పవన్ మధ్యాహ్నం 12.50 గంటలకు చేరుకున్నారు. అక్కడి నుంచి చేబ్రోలులోని నివాసానికి వెళ్లిపోయారు. మధ్యాహ్నం 2.50 గంటలకు ఆయన నివాసం నుంచి బయలుదేరి పిఠాపురం మండలం చిత్రాడ గ్రామానికి 3.20 గంటలకు చేరుకున్నారు. మహాలక్ష్మి ఆలయం నుంచి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్, జానీ మాస్టర్‌లతో కలిసి రోడ్‌షో చేశారు.



పవన్‌కు జేజేలు : పిఠాపురంలో పవన్‌కు జై కొడుతున్న జనం



మేమూ మీ వెంటే : పిఠాపురంలో పవన్‌కు మహిళల స్వాగతం



నీ చేయి తగిలినా చాలన్నా : పిఠాపురంలో యువత క్యూ

అనపర్తి ప్రజలతో 40 ఏళ్ల బంధం!

కూటమి అనపర్తి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



అభ్యర్థితో.. ఒకరోజు

పార్టీ మారింది.. గుర్తు మారింది.. అయినా అదే జనసందోహం.. వచ్చే వారు వస్తూనే ఉన్నారు.. టిఫిన్ చేసి ఆయన రాకకోసం ఎదురుచూస్తూనే ఉన్నారు.. ఉదయమే 5 గంటలకు ఇదీ కూటమి అనపర్తి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఇంటి ఆవరణలో కనిపించిన సీన్.. ఆంధ్రజ్యోతి అభ్యర్థితో ఒక రోజు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన వెంట నడిచింది.. ఉదయం 5.30 గంటలకు పత్రికలు చదవడంతో ఆయన దినచర్య ఆరంభమైంది.. ఉదయం 9.30 గంటల వరకూ కుటుంబీకులు.. జనంతో మమేకమైన ఆయన 10 గంటల సమయంలో ప్రచారానికి బయలుదేరారు.. అక్కడి నుంచి రాత్రి 11 గంటలకు ఇంటికి చేరుకునే వరకూ నిరాటంకంగా పర్యటన సాగింది.. ఎక్కడ చూసినా జన నీరాజనం.. ఎటు చూసినా హారతులు.. ఆప్యాయంగా పలకరింపులతో ప్రచారం సాగింది.. నువ్వెటుంటే.. మేమూ అటే బాబూ.. కమలానికే మా ఓటంటూ జనం నినదిస్తూనే ఉన్నారు.. ప్రచారం మధ్యలో ఆయన్ను పలకరించగా.. మా కుటుంబానికి నియోజకవర్గంతో 40 ఏళ్ల అనుబంధం.. నేను ఇంట్లో పెరగలేదు.. నా నియోజకవర్గ జనం మధ్యనే పెరిగా.. అందుకే నియోజకవర్గంలో ఎటు వెళ్లినా నన్ను వాళ్లింట్లో ఒకడిగా చూసుకుంటారు. అందుకే వారికి కష్టం వస్తే నాకు వచ్చినట్టే ఫీలవుతా.. వారి ఆనందంలో నేను భాగస్వామినవుతా.. నా ఇంట్లో కష్టం ఉన్నా వాళ్లూ అలాగే ఉంటారు.. మాదో విచిత్రమైన బంధం అంటూ చెప్పుకొచ్చారు.. - వివరాలు 5లో

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం. 4

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

తూర్పుగోదావరి ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. తుని				
2. జగ్గంపేట				
3. ప్రత్తిపాడు				
4. పెద్దాపురం				
5. పిఠాపురం				
6. కాకినాడ సిటీ				
7. కాకినాడ రూరల్				
8. అనపర్తి				
9. రాజానగరం				
10. రాజమండ్రి రూరల్				
11. రాజమండ్రి సిటీ				
12. రంపచోడవరం				
13. రామచంద్రపురం				
14. మండపేట				
15. కొత్తపేట				
16. పి. గన్నవరం				
17. రాజోలు				
18. అమలాపురం				
19. ముమ్మిడివరం				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : డోరు నెం. 114-2-485/2, దివాన్‌చెరువు టు వెలుగుబంద రోడ్, పాలచర్ల గ్రామ పంచాయితీ, రాజానగరం మండలం, రాజమండ్రి - 533102.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 16,169 నమోదు

రాజమహేంద్రవరం, మే 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా 16,169 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని జిల్లా ఎన్నికల అధికారి డా. కె.మాధవీలత తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనపర్తిలో 1477, రాజానగం 1376, రాజమండ్రి సిటీ 2848, రూరల్ 2558, కొవ్వూరులో 1527 మంది, నిడదవోలులో 1509 మంది, గోపాలపురంలో 1238 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు.



- రాష్ట్రంలో అరుదైన రాజకీయ నాయకుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి
- ఇప్పటివరకు 9సార్లు పోటీ చేసిన రికార్డు
- ఆరు సార్లు ఎమ్మెల్యేగా..
- ఇప్పుడు హ్యాట్రిక్ కొట్టేందుకు తహతహ

9 సార్లు పోటీ 6 సార్లు విజయం

ఆంధ్రప్రదేశ్‌లో అరుదైన రాజకీయ నాయకుల్లో గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఒకరు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల మధ్యనే ఉండే రాజకీయ నాయకుడిగా ఆయనకు గుర్తింపు ఉంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన పదోసారి శాసన సభ ఎన్నికల బరిలోకి దిగారు. ఇప్పటి వరకూ 9 సార్లు పోటీ చేసి ఆరుసార్లు విజయకేతనం ఎగురవేసిన సీనియర్ నాయకుడు గోరంట్ల ఏడో సారి కూడా తనదే గెలుపంటున్నారు..

బరిలో పదోసారి

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పదో సారి బరిలోకి దిగుతున్న బుచ్చయ్యచౌదరి తాను ఏడోసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టడం ఖాయమని ఘంటాపథంగా చెబుతున్నారు. రాజమహేంద్రవరం సిటీ నుంచి నాలుగుసార్లు, రాజమహేంద్రవరం రూరల్ నుంచి రెండో సారి గెలిచి, మళ్లీ రూరల్ నుంచి టీడీపీ కూటమి అభ్యర్థిగా దూసుకుపోతున్నారు. కమ్యూనిస్ట్ పార్టీ సానుభూతిపరుల కుటుంబం నుంచి వచ్చిన ఆయన రాజమహేంద్రవరంలో కమ్యూనిస్ట్ పార్టీల అనుబంధ విద్యార్థి సంఘాలలో క్రియాశీలకంగా వ్యవహరించారు. 1982లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించినపుడు, ఎన్టీఆర్ సమక్షంలో ఆయన పార్టీ తీర్థం తీసుకున్నారు. గోదావరి జిల్లాలో పార్టీ కన్వీనర్‌గా పార్టీని బలోపేతం చేసిన చరిత్ర ఆయనకు ఉంది. 1983, 1985, 1994, 1999లో రాజమండ్రి నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. అంతకు ముందు 1987 నుంచి ఆంధ్ర ప్రదేశ్ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా 1989 వరకు వ్యవహరించారు. 1989 నుంచి 91 వరకూ రాజమండ్రి, అమలాపురం, కాకినాడ పార్లమెంట్ స్థానాలకు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1994లో ఎన్టీఆర్ మంత్రివర్గంలో పౌర సరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. రాజమండ్రి సిటీ గెలిచి మంత్రి పదవి చేపట్టిన వారిలో గోరంట్ల రెండో వారు. మొదట ప్రజాపార్టీ నుంచి గెలిచిన డా. ఏబీ నాగేశ్వరరావు పురపాలక, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. తర్వాత గోరంట్ల బుచ్చయ్యచౌదరినే మంత్రిగా చేశారు తప్పిస్తే ఇంకెవరు రాజమహేంద్రవరం సిటీ నుంచి మంత్రి కాలేదు ఇప్పటివరకు. 1995లో ఎన్టీఆర్ తరపున నిలబడి, 1996లో రాజమహేంద్రవరం లోక్‌సభకు పోటీ చేసి ఓడిపోయారు. 1997లో చంద్రబాబు ఆహ్వానం మేరకు టీడీపీలోనే ఉన్నారు. 2014లో బీజేపీ పొత్తు వల్ల ఆయన రాజమండ్రి రూరల్ నుంచి పోటీ చేయాల్సి వచ్చింది. అప్పటి నుంచి ఆయనే అక్కడ గెలుస్తున్నారు. 2014, 2019లోనూ గెలిచారు. 2024లో కూడా ఆయనే పోటీ చేస్తున్నారు. ముచ్చటగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధిస్తాననే ధీమాలో గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఉన్నారు.

వ్యూహ ప్రతివ్యూహాలు



ఉప్పలగుప్తం, మే 10 : అభ్యర్థుల ఎంపిక మొదలు పోలింగ్ రోజు వరకు వ్యూహకర్తలే ఎన్నికల ప్రక్రియను నడిపిస్తున్నారన్నది జగమెరిగిన సత్యం. దశల వారీగా రాజకీయపార్టీల వ్యూహకర్తలు ప్రత్యర్థి శిబిరాల్లో గందరగోళం సృష్టించేలా కుట్రలు చేయడం షరా మామూలే. ప్రచారం, పార్టీ మార్పిడులు, ఎన్నికల మేనిఫెస్టో వంటి అంశాలపై ఎప్పటికప్పుడు వక్రభాష్యాలు, ఫేక్ మెసేజ్‌ల అలజడి, ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నాలు చేయడం ద్వారా ఓటర్లలో సందేహాల సృష్టికి శక్తి వంచన లేకుండా శ్రమిస్తుంటారు. అన్ని దశల్లోనూ పుకార్లను షికారు చేయించడం ద్వారా తమ వ్యూహ సాఫల్యతకు వ్యూహకర్తలు నానా తంటాలు పడుతుంటారు. అయితే ప్రచారపర్వం ముగింపు దశకు చేరుకోవడంతో చివరగా ఓటర్లపై పార్టీలు కుబేర అస్త్రాన్ని సంధించే యత్నాల్లో బిజీగా ఉన్నాయి. ఇక్కడ కూడా వ్యూహకర్తలు ప్రత్యర్థుల కుబేరాస్త్రం విఫలమయ్యేలా కుతంత్రాల మంత్రదండంతో ఓటర్లను ఇరుకునపెడుతున్నారు. ఉదాహరణకు ఒక పార్టీ అభ్యర్థి ఒక వీధిలో ఓటుకు వెయ్యి రూపాయలు పంచుతుంటే ప్రత్యర్థి పార్టీ వ్యూహకర్తలు పంపిణీ మొత్తాలపై పుకార్లు పుట్టిస్తున్నారు. ఫలానా గ్రామంలో ఓటుకు రెండు వేలు పంచుతున్న పార్టీ ఇక్కడ వెయ్యితో సరిపెడుతున్నారంటూ పుకార్లను షికారు చేయిస్తున్నారు. దీంతో కొందరు ఓటర్లు పంపిణీదారులను నిలదీస్తున్నారు. మీరు కొంత మినహాయించుకుని మాకు పంచుతున్నారంటూ ఆరోపణాస్త్రాలు సంధిస్తున్నారు. ఈ రకమైన గందరగోళంతో ప్రత్యర్థి పార్టీ ఇరుకున పడుతోంది. వాస్తవాలేమైనప్పటికీ కేవలం పుకార్లకే జనం ఓటేయడంతో పరిస్థితి సందిగ్ధంలో పడింది. గ్రామ, వార్డు స్థాయి నాయకులు ఓటర్లను నమ్మించడానికి నానా తిప్పలు పడుతున్నారు. దాదాపు అన్ని పార్టీల శిబిరాల్లోనూ ఈ పుకార్లు నాయకులకు తలనొప్పిగా పరిణమించాయి. జనరల్ నియోజకవర్గాల్లో అధిక మొత్తంలో జరుగుతున్న కాసుల పంపిణీని రిజర్వుడు నియోజకవర్గాల్లో ప్రచారం చేయడం ద్వారా వ్యూహకర్తలు ఓటర్లలో సందేహాలను రేకెత్తిస్తున్నారు. పార్టీ నిర్ణయం మేరకే పంపిణీ తప్ప మేము కేవలం నిమిత్తమాత్రులమంటూ స్థానిక నాయకులు ఓటర్లకు నచ్చచెప్పేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. చివరి దశలో ప్రత్యర్థి పార్టీల ఓట్లు దండుకోవడానికి వ్యూహకర్తల ప్రయత్నాలు ఫలిస్తాయా? బెడిసికొడతాయా అన్నది ఓటరు దేవుళ్లకే ఎరుక.



మునిగేదెవరు?

అధికార వైసీపీపై గుర్రుగా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు

ప్రచారాస్త్రంగా 'అన్యాయం'..తలరాతను నిర్దేశించే తీర్పుకు రెడీ



నిర్వాసితులకు మొండి చెయ్యి

(రంపచోడవరం):

రంపచోడవరం గిరిజన నియోజకవర్గంలో ఐదు మండలాల్లోని పోలవరం నిర్వాసితులే ఇక్కడి అభ్యర్థుల తలరాతను నిర్దేశించనున్నారు. పోలవరం ప్రాజెక్టు, తద్వారా గోదావరి తీరంలోని ఐదు మండలాలకు ఒనగూరే దుష్ప్రయోజనాలు, పునరావాస అంశాలే ఈ ఎన్నికల్లో ప్రచారాస్త్రాలుగా మారాయి. ముఖ్యంగా గత 59 నెలలుగా వైసీపీ ప్రభుత్వంలో ఎదురైన చేదు అనుభవాలు నిర్వాసిత ఓటర్లను ప్రతికూలంగా మార్చాయి. పోలవరం నిర్వాసితులకు టీడీపీ అన్యాయం చేసిందంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆ తర్వాత పునరావాసాన్ని గాలికి వదిలేసింది. వాస్తవానికి గోదావరిలో సగానికిపైగా ఖాళీగా వదిలేసిన కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసి, ఎత్తు పెంచేసిన పాపం వైసీపీ ప్రభుత్వానిదే! ఫలితంగా తదనంతర వరదలకు కారణమై మునుపెన్నడూ లేని ముంపును విలీన మండలాలకు వైసీపీ తెచ్చిపెట్టింది.

వైసీపీని నమ్మిన నిర్వాసితులకు జగన్ మొండి చేయి చూపారు. పోలవరం రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేసే ఆరు నెలల ముందే నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పునరావాసాన్ని కల్పించాలన్న నిబంధనను ఉల్లంఘించి నిర్వాసితులను ముంచేసింది. దేవీపట్నం మండలంలో ముంపు గ్రామాలన్నిటినీ పూర్తి స్థాయి పునరావాసం కల్పించకుండానే బలవంతంగా తరలించేశారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం పునరావాసం పూర్తి చేయకుండా నిర్వాసితులను ఖాళీ చేయవద్దంటూ ఓ ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో ఇచ్చిన ఉత్తర్వులను బేఖాతరు చేసి నిర్వాసితులను ఖాళీ చేయించింది.

పునరావాస ప్రగతి శూన్యం

విలీన మండలాలకు అన్యాయం

విలీన మండలాల్లో పునరావాస చర్యల్లో ప్రగతి శూన్యమే. వైసీపీ పాలనలో పోలవరం చేపట్టాక వచ్చిన మూడు గోదావరి వరదల్లో ఊహించని ముంపును ఎదుర్కొని గ్రామాలను కట్టుబట్టలతో ఖాళీ చేసి వెళ్లిపోయిన చేదు అనుభవం గోదావరి ప్రభావిత గిరిజన గ్రామాలను వెంటాడుతోంది. ఫలితంగా వైసీపీ ప్రభుత్వం మూలంగా నష్టాన్ని చవిచూసిన చింతూరు, వి.ఆర్.పురం, కూనవరం, ఎటపాక మండలాలు, దేవీపట్నం మండలంలోని పోలవరం ప్రభావిత ఓటర్లు వ్యవహరించే తీరే ఇక్కడి అభ్యర్థుల తలరాతలను మార్చేసేలా ఉంది. మొత్తం సుమారు 2.77 లక్షల ఓటర్లలో సుమారు ఒక లక్ష మంది పోలవరం ప్రభావిత ఓటర్లే! ఇందులో మెజారిటీ ఓట్లు ఎటు మళ్లుతాయో అటే విజయావకాశాలు ఉండటంతో అధికార వైసీపీ ఆందోళనలో పడింది. తాము నిర్వాసితులకు అండగానే ఉన్నా మని, పునరావాసం కల్పించాకనే నిర్వాసితుల తరలింపు ఉంటుందని తమకే మళ్లీ అవకాశం కల్పించాలని కోరుతున్నారు. టీడీపీ అయితే నిర్వాసితులకు అన్యాయం చేసింది జగన్ ప్రభుత్వమేనని, తమ పార్టీ అధికారంలో ఉండగా నిర్వాసితులకు జరిగిన అన్యాయం ఏదీ లేదని, నిర్వాసితుల బలవంతపు తరలింపు తాము చేయలేదని తమకే అవకాశం ఇవ్వాలని కోరుతోంది. అసలు నిర్వాసితులకు అన్యాయం చేసింది ఈ రెండు పార్టీలేనని, ఈ రెండు పార్టీలకు బుద్ధి చెప్పి తమకు అవకాశం ఇవ్వాలంటూ సీపీఎం ఇంటింటా ప్రచారం సాగిస్తోంది. అయితే వైసీపీ వ్యతిరేక ఓటుతో పాటు నిర్వాసితుల ఓట్లపైనే సీపీఎం ఎక్కువ ఆశపెట్టుకుంది. దీంతో సీపీఎం ఎవరి ఓట్లను చీల్చుతుందో, నిర్వాసితులు ఎవరివైపు నిలిచి, ఎవరిని ముంచుతారో అన్న చర్చ సాగుతోంది.

ఎన్నికల సిబ్బంది మెనూ

ప్రకటించిన ఎన్నికల సంఘం



పెద్దాపురం, మే 10 : ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ విధులకు నియమించిన సిబ్బందికి ఈనెల 12, 13 తేదీల్లో ఇవ్వాల్సిన మెనూను ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు. 12వ తేదీ సాయంత్రానికి ఎన్నికల సామగ్రితో సిబ్బందికి తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు రాగానే వారికి బొండాలు, గారెలు అల్పాహారం మజ్జిగ లేదా టీ ఇవ్వాలి. రాత్రి 7.30 గంటలకు చపాతీ/రోటీ, అన్నం, ఆకుకూర పప్పు, రోటీ పచ్చడి, టమాటా, ఆలుకూర, రసం, పెరుగు వడియాలు, అరటి పండు ఇవ్వాలి. పోలింగ్ రోజైన 13వ తేదీ ఉదయం 4.30 గంటలకు టీ, ఐదు గంటలకు వేడి ఇడ్లీ, గారె, రెండు చట్నీలు ఇవ్వాలి. 9 గంటలకు ఫ్రూట్స్, మజ్జిగ లేదా కొబ్బరి నీళ్లు, 11 గంటలకు ప్లమ్ కేక్, టీ.. 12.30 గంటలకు విజిటబుల్ బిర్యానీ, పెరుగు అన్నం, నిమ్మబద్ద మూడు గంటలకు ఉస్మానియా బిస్కెట్లు, టీ లేదా ఫ్రూట్స్ సలాడ్, ఆరు గంటలకు బొండా, గారి చట్నీ, టీ, మజ్జిగ ఇస్తారు. ఇవన్నీ స్థానికంగా తయారు చేయించి ఫ్రెష్‌గా సరిపడేలా తయారుచేసి వడ్డించాలి. ఒక్కొక్క పోలింగ్ స్టేషన్ పరిధిలో 15 మంది సిబ్బంది మెనూ ప్రకారం భోజనం అల్పాహారం అందించాలి.


బీప్ శబ్దం వస్తేనే..



ఆత్రేయపురం, మే 10: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగే పోలింగ్‌లో ఓటు వేసేటప్పుడు ఓటర్లు జాగ్రత్తలు తీసుకోవాలి. పోలింగ్ కేంద్రంలో ఈవీఎం బటన్ నొక్కినప్పుడు... బీప్ అనే వచ్చే శబ్దం గమనించాలి. అలా శబ్దం రాకుంటే ఓటు దుర్వినియోగం అయినట్టు భావించాల్సి వస్తుంది. అందుకే ఓటు వేసే ప్రతి ఒక్క ఓటరు దృష్టి కేంద్రీకరించాలి. పోలింగ్ కేంద్రంలో ఉండే ముగ్గురు అధికారుల్లో మొదటి అధికారి మన వివరాలు పరిశీలించి ఒక స్లిప్ ఇస్తారు. రెండో అధికారి ఓటరు నుంచి సంతకం తీసుకుంటారు. మూడో అధికారి చేతి వేలికి ఇంకు మార్కు వేస్తారు. ఈ అధికారి వద్దే ఈవీఎం మాస్టర్ కంట్రోల్ యూనిట్ ఉంటుంది. అది నొక్కినప్పుడు మాత్రమే ఈవీఎం యాక్టివేట్ అవుతుంది. ఈవీఎంలో పార్టీ అభ్యర్థి పేరు, వివరాలు కనిపిస్తాయి. అప్పుడు ఓటరు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయవచ్చు. బటన్ నొక్కినప్పుడు శబ్దం రాకపోతే ఓటు పడలేదని అర్థం. వృద్ధులు, కొత్త ఓటర్లు ఓటు దుర్వినియోగం కాకుండా కాపాడుకోవాలి.

నేడు పిఠాపురానికి

మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్



పిఠాపురం, మే 10: మెగా హీరో రామ్‌చరణ్ శనివారం పిఠాపురం రానున్నారు. తన తల్లి సురేఖతో కలిసి హైదరాబాద్ నుంచి పిఠాపురం రానున్న ఆయన ఉదయం 9.30 గంటలకు పాదగయ క్షేత్రాన్ని సందర్శించుకోనున్నారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరదేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్టాన దేవతయిన పురుహూతికాఅమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానాన్ని సందర్శించి పూజలు చేస్తారు. పూజలు తర్వాత జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను కలుస్తారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. ఇందుకు సంబంధించి నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు పిఠాపురానికి జగన్

ప్రజలకు కష్టాలు ప్రారంభం



ఏర్పాట్ల పరిశీలనలో అధికారులు




హెలిపాడ్

- జగన్ వచ్చే మార్గంలో షాపులు మూసివేయాలని హుకుం
- ఇప్పటికే చెట్ల నరికివేత.. జనసమీకరణకు నేతల పాట్లు
- వైసీపీ నాయకుల మధ్య సమన్వయ లోపం
- జనసమీకరణ బాధ్యత నుంచి తప్పుకుంటున్న వైనం

పిఠాపురం, మే 10: పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో శనివారం మధ్యాహ్నం జరిగే వైసీపీ ఎన్నికల ప్రచార సభలో సీఎం జగన్ పాల్గొననున్నారు. సీఎం రానుండటంతో పట్టణ ప్రజలకు కష్టాలు అప్పుడే ప్రారంభమయ్యాయి. ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో కాంక్రీటుతో హెలిపాడ్ నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. ఇప్పటికే దీనిపై క్రీడాభిమానులు నుంచి విమర్శలు వస్తున్నాయి. ఇక్కడ హెలిపాడ్ దిగి ఉప్పాడ సెంటర్ వరకూ సీఎం బస్సులో వెళ్లనున్నారు. ఈ మార్గంలో ఉన్న షాపులన్నింటిని శనివారం ఉదయం నుంచే మూసివేయాలని పోలీసులు హుకుం జారీ చేశారు. పట్టణంలోని ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. పట్టణంలోకి వచ్చే వాహనాలు అన్నింటిని బైపాస్‌రోడ్డు మీదుగా మళ్లిస్తామని పోలీసులు తెలిపారు. మరోవైపు సీఎం సభకు జన సమీకరణ కోసం వైసీపీ నేతలు పాట్లు పడుతున్నారు. శుక్రవారం సాయంత్రం వరకూ జనసమీకరణ బాధ్యతలు ఎవరు తీసుకోవాలనే అంశంపై తర్జనభర్జనలు పడ్డారు. బాధ్యత మీదంటే మీదని ఒకరిపై ఒకరు నెపం వేసుకున్నారు. అందరు వచ్చి హడావుడి చేసే వారే తప్ప పనిచేసే వారు లేరని పలువురు పట్టణ, మండలస్థాయి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు కడప, చిత్తూరు జిల్లాలు నుంచి వచ్చిన నేతలు జనసమీకరణపై సమీక్ష చేపట్టారు. తీసుకువచ్చిన ప్రతి ఒక్కరికి రూ. 300 ఇస్తామని ఆటో ఖర్చులు ఇస్తామని సదరు నేతలు, గ్రామ, మండల, పట్టణ, వార్డు స్థాయి నాయకులతో చెప్పారు. ఇప్పుడికి ఇప్పుడు చెబితే ఎలా అని పలువురు ప్రశ్నించారు. కాగా సీఎం జగన్ ప్రచార సభ బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పరిశీలించారు.

మేం ఓట్లు అమ్మోకోం..



గొల్లప్రోలు, మే 10: 'ఈ ఇంటిలో ఓట్లకు నోటు తీసుకొనబడవు' అంటూ రాసిన కాగితం గొల్లప్రోలులో ఓ ఇంటి వద్ద దర్శనమిచ్చింది. తాటిపర్తి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న గెడ్డమూరి శివ శ్రీనివాసరావు గొల్లప్రోలు పట్టణంలోని దేవీనగర్‌లో నివాసముంటున్నారు. ఓటుకు నోటు ఇస్తూ రాజకీయ పక్షాలు ప్రలోభాలకు గురిచేస్తున్న నేపథ్యంలో ఆయన ముందే మేలుకొన్నారు. ఇంటిలో ఉన్న తనతో పాటు తన భార్య ఓటును అమ్ముకోకూడదని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు తమ ఓటరు నెంబర్లు ఉదహరిస్తూ ఈ ఇంటిలో ఓట్లుకు నోటు తీసుకోమని, దయచేసి ఎవ్వరు ఓటుకు నోటు ఇవ్వడానికి ప్రయత్నించకండి అని చెబుతూ నోటీసులు అంటించారు. ఇది గొల్లప్రోలు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

జనసేన సెగ

కొత్తపల్లి, మే 10: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసీపీ పిఠాపురం ఎమ్మెల్యే వంగా గీతావిశ్వనాథ్‌కు జనసైనికుల సెగ తగిలింది. శుక్రవారం వైసీపీ అభ్యర్థి కొత్తపల్లిలో ఎన్నికల ప్రచారం చేపట్టేందుకు ఉప్పాడ నుంచి కొత్తపల్లి బయలుదేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి గీత వాహనంలో కొత్తపల్లి పాత రెవెన్యూ కార్యాలయం మీదుగా ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు. ఈ లోగా పాత రెవెన్యూ కార్యాలయం వద్ద జనసేన పార్టీ కార్యాలయం వద్ద జనాలను చూసిన ఆమె ఆగే ప్రయత్నం చేసేలోగా అక్కడ ఉన్న వారంతా జై జనసేన, జై పవన్‌కల్యాణ్ అంటూ నినా అక్కడ ఆగకుండా కాలనీకి వెళ్లారు. తర్వాత కాలనీలోకి వెళ్లి ఓట్లు అభ్యర్థించేందుకు ఇంటింటికీ వెళ్లగా మహిళలు ఎవరూ బయటకు రాకపోవడంతో ఆమె వెనుదిరిగారు. అక్కడ నుంచి వాకతిప్ప చేరుకొని ప్రచారాన్ని కొనసాగించారు.

వైసీపీ నాయకులు

నొక్కేస్తున్నారు!

కొత్తపల్లి, మే 10: అధికార వైసీపీ పంపిణీ చేసే నగదులో పలువురు నాయకులు చేతివాటం ప్రదర్శించడంతో గ్రామాల్లో ప్రజలు నాయకుల తీరుపై గుర్రుగా ఉన్నారు. ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో అభ్యర్థులు ఓట్ల కోసం ప్రజలకు ఇచ్చే నగదులో కూడా కోత పెట్టడంతో ఆవేదన చెందుతున్నారు. గ్రామాల్లో ఓటర్లకు ఇచ్చే డబ్బులు పంపిణీ చేసే వ్యక్తులు తమ జేబుల్లో నుంచి ఇచ్చినట్టుగా కోత పెడుతున్నారని ఆవేదన చెందుతున్నారు. ఒక్కొక్క ఓటుకు రూ.3000 ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.1500 ఇస్తున్నారని, అసలు ఇవ్వకపోయినా బాగుండేదని ఇచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని గ్రామాల్లో ఓటర్లు అనుకొంటున్నారు. డబ్బులు తీసుకొని మనం చేసేది చేద్దామని గ్రామాల్లో ప్రజలు అంతరంగికంగా చర్చించుకోవడం గమనార్హం.


వాళ్లు జనసేనకు ఓటేస్తారు..!

డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు..

పిఠాపురం/గొల్లప్రోలు, మే 10: పిఠాపురం నియోజకవర్గంలో అధికార వైసీపీ ప్రలోభాలకు తెరలేపింది. భారీగా ఓట్లు కొనుగోలు చేసేందుకు చిత్తూరు, కడప జిల్లాలకు చెందిన నేతలు రంగంలోకి దిగారు. వారి కనుసన్నల్లో గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాలతో పాటు పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాల్లో ఓట్లు కొనుగోలుకు భారీగా నగదును తీసుకువచ్చారు. ఓటుకు రూ.3 వేలు వంతున నగదు పంపిణీ చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో చీరలు పంపిణీ చేశారు. అయితే పంపిణీలో వైసీపీ నేతలు వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారింది. జనసేనకు ఓటు వేస్తారు అని అనుమానం ఉన్న వారికి డబ్బులు ఇవ్వడం లేదు. వారు గాజుగ్లాసుకు ఓటు వేస్తారు వారికి డబ్బులు ఇవ్వక్కర్లేదని బహిరంగంగానే వైసీపీ నేతలు చెబుతున్నారు. దీనిపై గొల్లప్రోలు పట్టణంతో పాటు పిఠాపురం, కొత్తపల్లి మండలాల్లో పలుచోట్ల వివాదాలు జరిగాయి. తమకు ఎందుకు డబ్బులు ఇవ్వరని ప్రజలు నిలదీస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల చోటా మోటా వైసీపీ నేతలు సమాధానం చెప్పలేక జారుకుంటున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

డెల్టా కాలువల కట్టివేత

ధవళేశ్వరం, మే10: డెల్టా కాలువలకు నీటి నిల్వలు నిలిపివేసి కాల్వలు కట్టివేశారు. శుక్రవారం సాయంత్రం తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాలువలకు నీటిని విడుదల చేసే హెడ్ స్లూయిజ్ గేట్లను పూర్తిగా దించేసి కాల్వలకు నీటి విడుదల నిలిపివేశారు. ఖరీఫ్ చివరి ఆయకట్టు వరకు నీరు పారే విధంగా కాల్వలో పూడికతీత పనులు, లాకులు, తూముల షెట్టర్ల రిపేర్లు, వంటి పనులు నిర్వహించి జూన్ మొదటివారం నాటికి నీటిని విడుదల చేయడానికి కాల్వలు సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు.



మద్యం కేసులు స్వాధీనం



పిఠాపురం రూరల్, మే 10: పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, పోలీసులు శుక్రవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. గ్రామంలోని వనుం సత్యనారాయణ ఇంటిలో ఉంచిన 77 కేసుల మద్యం బాటిళ్లను (3,234 మద్యం సీసాలు) స్వాధీనం చేసుకున్నారు. వీటిని స్వాధీనం చేసుకోవడంలో పోలీసులు, అధికారులు తీవ్ర జాప్యం చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు, ఇది వైసీపీ నేతలకు చెందిన మద్యం కావడంతో అధికారులు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎట్టకేలకు పోలీసులు సదరు తాళాలు తొలగించి మద్యం సీసాలను సీజ్ చేశారు. వీటిని వైసీపీ నాయకులు నిల్వ చేసినట్లు చెబుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో వీటిని ఉంచినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

గోదావరి జిల్లాల్లో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అంశాలు ప్రధానంగా ఏమై ఉంటాయన్న దిశగా చర్చ నడుస్తోంది. సామాజిక బలాలు, మహిళల ఓటింగ్, కీలకమైన యువత ఓటింగ్... ఈ సందర్భంలో చర్చనీయాంశం అయ్యాయి. కాసేపు అభివృద్ధి, సంక్షేమం తదితర వాగ్దానాలను పక్కనబెడితే.. ఏ వర్గాల ఓట్లు ఎవరికి అనుకూలంగా మారతాయన్నది ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ విషయంలో వైసీపీతో పోల్చితే.. 'కూటమి' పైచేయిగా ఉందనే చెప్పాలి. టీడీపీ, జనసేన, బీజేపీ కలయిక.. మెజారిటీ ఓటింగ్ శాతాన్ని సాధించేవిధంగా ఉందని విశ్లేషకులు సైతం చెబుతున్నారు. తెలుగుదేశం, జనసేన కలసి పోటీచేస్తుండడంతోపాటు బీజేపీ సంప్రదాయ ఓటింగ్ అదనంగా కలిసొచ్చే అంశం. అంతేగాకుండా ఈసారి సామాజిక సమీకరణాల్లో పెనుమార్పులు కనిపిస్తుండడం, యువత, ఉద్యోగుల ఓటింగ్ ఎటువైపో ఇప్పటికే కొంత స్పష్టత ఉండడం 'కూటమి' విజయావకాశాలపై అంచనాలను పెంచేసింది. కూటమి పార్టీల మధ్య వైసీపీ ఊహించినట్టుగా సమన్వయలోపం రాకపోగా, అద్భుతమైన ఐక్యత రాగంతో కదనరంగంలో దూసుకెళ్లడం మరో విశేషం.

'బంధం' బలమెంత?

- గోదావరి తీరంలో ఐక్యతా రాగం
- వైసీపీకి వణుకుపుట్టిస్తున్న 'కూటమి'
- ఓట్ల బదిలీకి పట్టుబిగించిన నేతలు
- సామాజిక సమీకరణల్లోనూ మార్పులు
- 'కీలక' ఓటింగ్ వర్గాలపై ప్రభావితం
- ఓకే మాట.. ఒకే లక్ష్యంతో ముందుకు సాగిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి మంచి జోష్ మీద ఉంది. మిత్రబంధం బలంగా.. ముందుకు పయనిస్తోంది. అందరిదీ ఒకటే మాట. ప్రజాకంటక పాలనపోవాలి. వైసీపీని సాగనంపాలి. అదే లక్ష్యం. ఇదే ఆలోచనతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రజావ్యతిరేక ఓట్లు చీలకూడదంటూ 'కూటమి'కి రాజమహేంద్రవరంలోనే బీజం వేశారు. అక్రమకేసుల్లో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడిని ములాఖత్ అయిన తర్వాత తెలుగుదేశం-జనసేన పొత్తు విషయం ప్రకటించారు. ఈ బంధానికి బీజేపీ కూడా త్రివేణీ సంగమంలా కలవడంతో అది మరింత బలపడింది. ప్రస్తుత ఎన్నికల్లో 'కూటమి'గా కలసి ప్రత్యర్థి వైసీపీపై తలపడుతోంది. సీట్ల పంపకం తర్వాత ఉమ్మడి తూర్పుగోదావరిలోని కాకినాడ, అమలాపురం, రాజమండ్రి పార్లమెంటు పరిధిలో రాజమండ్రిలో బీజేపీ, కాకినాడలో జనసేన, అమలాపురంలో టీడీపీ పోటీచేస్తున్నాయి. అసెంబ్లీల విషయానికొస్తే మూడు పార్లమెంటు స్థానాల్లో 21 స్థానాలకుగాను జనసేన 6 స్థానాల్లోను, బీజేపీ 1 స్థానంలోను, టీడీపీ 14 స్థానాల్లో టీడీపీ పోటీచేస్తున్నాయి. వాస్తవానికి ఆయా చోట్ల సీట్ల పంపకంలో కొంత గందరగోళం, ఆందోళనలు నెలకొన్నాయి. దాంతో ఆయా పార్టీల మధ్య ఐక్యత లోపించి కుమ్ములాటలు తప్పవని అధికార వైసీపీ కలలు కంది. కానీ ఒకే లక్ష్యంతో ఉన్న తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నేతలు, శ్రేణులు ఐక్యమయ్యాయి. కిందిస్థాయి కార్యకర్తను అడిగినా, అభ్యర్థిని ప్రశ్నించినా, పొత్తుల వల్ల టిక్కెట్లను త్యాగం చేసిన నేతలను అడిగినా ఒకటే మాట. దుర్మార్గ పాలకుడు జగన్ పోవాలి. వైసీపీ అంతమవ్వాలి. నష్టపోయిన రాష్ట్రాన్ని, నష్టపోయిన ప్రజలను కాపాడడం కోసం కూటమి గెలవాలి. ఇదే అంశాన్ని జనంలోకి తీసుకెళ్లడంలో కూటమి నేతలు విజయం సాధించారు. అభ్యర్థి, ఆ నియోజకవర్గంలో మిత్రపక్ష నేతల మధ్య సమన్వయం కూడా బాగుండడంతో కేడర్ ఒకేతాటిపైకి రావడానికి పెద్దగా సమయం పట్టలేదు. ఇప్పుడు ఊరూరా కూటమి పక్షాల కేడర్ అంతా కలసి ముందుకు సాగుతున్న దృశ్యాలే అన్ని చోట్లా కనిపిస్తున్నాయి. ఇదే ఇప్పుడు వైసీపీ అభ్యర్థుల్లో, ఆ పార్టీ నేతల్లో వణుకు పుట్టిస్తోంది. గోదావరి జిల్లాలో తీర్పు ఎప్పుడూ 'సునామీ'లా వ్యక్తమవుతుండడంతో ప్రత్యర్థుల గుండెల్లో గుబులురేపుతోంది. 2019 ఎన్నికల నాటికి ఇప్పటికి ఉన్న మార్పులను చాలామంది విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా టీడీపీ, జనసేన కలిసిపోవడం, బీజేపీ సంప్రదాయ ఓటింగ్ కూడా ఈసారి కీలకంగానే ఉంటుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేగాకుండా సామాజిక వర్గాల ఓట్ల బదిలీ పెను సంచలనాలకు దారితీస్తుందేమోనన్న అంచనాలు కూడా దడ పుట్టిస్తున్నాయి. గోదావరి జిల్లాల్లో మెజారిటీ వర్గాల్లో 'ముఖ్య'మైన ఓటింగ్ ఒకే తాటిపైకి వస్తుండడం వైసీపీ నేతల్లో కలవరం కలిగిస్తోందని పలువురు చెబుతున్నారు. మహిళలు, యువతరం ఓటింగ్ కూడా ఎటువైపు ఉందనే విషయంలో ఎవరి అంచనాలు వారికి ఉన్నాయి. మహిళలు టీడీపీ పథకాలకు ఆకర్షితులు కావడం, యువతను ఎక్కువగా పవన్‌కల్యాణ్ ప్రభావితం చేయడం కూడా ఓటింగ్ సరళిని మార్చివేసే అవకాశం ఉందని మరో విశ్లేషణ సాగుతోంది. మొత్తానికి కలసికట్టుగా ఎన్నికల బరిలో దిగడం 'కూటమి'కి లాభమేనని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయంగా ఉంది. అదే దిశగా ఊరూరా కూటమి శ్రేణులు ఎన్నికల బరిలో దూసుకెళుతున్నాయి.

రాజమండ్రి పార్లమెంటు పరిధిలో..

రాజమండ్రి లోక్‌సభ కూటమి బీజేపీ అభ్యర్థిని దగ్గుబాటి పురందేశ్వరి 'కూటమి' సహకారంతో ఎన్నికల బరిలో దూసుకుపోతున్నారు. ఎన్టీఆర్ కుమార్తె కావడం వల్ల ఆమెను సొంత ఆడబడుచులా అన్ని నియోజకవర్గాల్లో ఆదరిస్తున్నారు. ఆమె విజయానికి కూటమి తరఫున టీడీపీ నేతలు గన్ని కృష్ణ, బొడ్డు వెంకటరమణ వంటివారు పనిచేస్తున్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని జనసేన కేడర్, టీడీపీ కేడర్ కలసి పనిచేస్తున్నారు. ఇక రాజమండ్రి సిటీ కూటమి టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసుకు మద్దతుగా సిటీ జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనిచేస్తున్నారు. మరో నాయకుడు వై.శ్రీనివాస్ కూడా అదే రీతిలో పనిచేస్తున్నారు. రూరల్ కూటమి టీడీపీ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి విజయానికి జనసేన కేడర్ అంతా పనిచేస్తోంది. రూరల్ జనసేన ఇన్‌చార్జి కందుల దుర్గేష్ నిడదవోలు నుంచి పోటీచేస్తుండడంతో ఆయన సూచనలతో జనసేన కేడర్ పూర్తి స్థాయిలో రంగంలోకి దిగింది. బీజేపీ శ్రేణులు కూడా గోరంట్ల గెలుపు కోసం పాటుపడుతున్నాయి. రాజానగరం కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణకు అండగా టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, టీడీపీ మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ వర్గం, మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర వంటివారు సైతం నిలిచారు. అనపర్తి కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయంకోసం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, బీజేపీ నేత కృష్ణంరాజుతోపాటు కేడర్ అంతా ఒకటే లక్ష్యంగా పనిచేస్తున్నారు. గోపాలపురం కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు విజయానికి మాజీ జడ్పీ ఛైర్మన్, టీడీపీ సీనియర్ నేత ముళ్లపూడి బాపిరాజుతోపాటు జనసేన ఇన్‌చార్జి డి.సువర్ణరాజు కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనిచేస్తున్నారు. నిడదవోలు కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్ విజయం కోసం టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, ఆ పార్టీ శ్రేణులు బాగా పనిచేస్తున్నాయి. కొవ్వూరు కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు విజయానికి అక్కడ కింగ్‌మేకర్‌గా ఉన్న అచ్చిబాబు అన్నీ తానై పనిచేస్తున్నారు. జనసేన ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే రామారావుకు వేరేచోట బాధ్యతలు అప్పగించినా వీలైనప్పుడల్లా ఇక్కడ పనిచేస్తున్నారు. ఇక్కడ జనసేన, బీజేపీ కేడర్ కూడా గెలుపుకోసం కృషి చేస్తున్నాయి.

ఒకటే అజెండా.. అరాచక పాలనకు చరమగీతం పాడాలి...

రాజమహేంద్రవరంసిటీ/కడియం/కొవ్వూరు/ మే10: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మిత్రధర్మం పాటిస్తూ అధర్మంపై యుద్ధం చేస్తోంది. అందరిదీ ఒకటే అజెండా.. అరాచక పాలనకు చరమగీతం పాడడమేనని రాజమండ్రి సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నిర్ణయానికి కట్టుబడి జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని జనసేన పార్టీ నగర ఇన్చార్జి అనుశ్రీ సత్యనారాయణ చెప్పారు. టీడీపీ, బీజేపీలతో కలిసి జనసేన నాయకులు, వీరమహిళలు, జనసైనికులు పెద్దఎత్తున ఎన్నికల ప్రచారం చేశామని ఆయన తెలిపారు. ఉమ్మడి లక్ష్యంతో ముందుకెళుతున్నట్టు అనుశ్రీ చెప్పారు. రాజమండ్రి బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ యెనుముల రంగబాబు మాట్లాడుతూ బీజేపీ ఎంపీ పురందేశ్వరి, అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి శ్రీనివాస్ గెలుపు కోసం తమ శ్రేణులంతా అహర్నిశలు పనిచేస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో వైసీపీ వ్యతిరేక ఓటు చీలకుండా చూడాలన్న పవన్‌కల్యాణ్ పిలుపుమేరకు జనసేన శ్రేణులంతా పనిచేస్తున్నాయని కడియం మండల జనసేన అధ్యక్షుడు ముద్రగడ జమీ అన్నారు. ఇక అనపర్తిలో బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం కోసం పూర్తిస్థాయిలో జనసేన శ్రేణులంతా పనిచేస్తున్నట్టు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సీట్ల సర్దుబాట్ల విషయంలో ఇక్కడ కొంత గందరగోళం చోటుచేసుకున్నా మిత్రపక్షాలైన టీడీపీ, బీజేపీ, జనసేన కలసికట్టుగా అభ్యర్థి విజయానికి పనిచేస్తుండడం అనూహ్యంగా అంచనాలను పెంచేసిందనే చెప్పాలని కూటమి శ్రేణులు పేర్కొంటున్నాయి. ఇక కొవ్వూరు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులంతా తన విజయానికి కృషిచేస్తున్నారని కూటమి టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు పెండ్యాల అచ్చిబాబు సారథ్యంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో మిత్రపక్షాలను కలుపుకుంటూ ముందుకుసాగుతున్నామని ఆయన తెలియజేశారు. అటు నిడదవోలు నియోజకవర్గానికి సంబంధించి జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్ విజయానికి టీడీపీ, బీజేపీ శ్రేణులు కలసి పనిచేస్తున్నాయి. నిడదవోలు పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ప్రత్యేక ప్రణాళికతో తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కలసి దుర్గేష్ విజయానికి కృషి చేస్తున్నామని చెప్పారు. నిడదవోలు నియోజకవర్గంలో కూటమి గెలుపు తథ్యమని ఆయన తెలిపారు. జనసేన నిడదవోలు అధ్యక్షుడు రంగా రమేష్ మాట్లాడుతూ దుర్గేష్ విజయానికి తెలుగుదేశం, బీజేపీలు విశేషంగా కృషి చేస్తున్నాయని చెప్పారు. గోపాలపురం నియోజకవర్గ కూటమి టీడీపీ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుధర్మం నూరుశాతం విజయవంతంగా కొనసాగుతోందని చెప్పారు. మూడు పార్టీల కలయికతో కార్యకర్తల్లో ఉత్సాహం మరింత పెరిగిందన్నారు. ఎటువంటి అరమరికలు లేకుండా సమన్వయంతో కలిసి పనిచేస్తూ ముందుకెళ్తున్నామన్నారు. గోపాలపురం జనసేన ఇన్చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశానుసారం పొత్తు ధర్మానికి కృతనిశ్చయంతో పనిచేస్తున్నామని చెప్పారు. కూటమి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా నూరుశాతం సహకరిస్తున్నామని, జగన్ అనే ఒక దుర్మార్గుడిని గద్దెదించడం కోసం, అరాచకపాలన అంతచేసేందుకు అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాన్ని శిరసావహిస్తామని ఆయన స్పష్టంచేశారు.

అభ్యర్థితో.. ఒకరోజు


కుటుంబ సభ్యులతో కలిసి అల్పాహారం తీసుకుంటున్న నల్లమిల్లి



ప్రజలే బలం..ప్రజాభీష్టం మేరకే
నా పయనం

ఆర్థిక స్తోమత లేకున్నా ప్రజా బలం ఉంది..
వారికి జీవితాంతం రుణపడి ఉంటాం
అనపర్తి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

ప్రజలే తన బలమని, ప్రజాభీష్టం మేరకే బీజేపీ నుంచి పోటీ చేస్తున్నానని అనపర్తి నియోజవర్గ బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. తమ కుటుంబానికి ఆర్థిక స్తోమత లేకున్నా ప్రజా బలం ఉందని వారి ప్రేమకు తమ కుటుంబం జీవితాంతం రుణ పడి ఉంటామని రామకృష్ణారెడ్డి అన్నారు. అభ్యర్థితో ఒకరోజు శీర్షికలో భాగంగా ఆంధ్రజ్యోతి నల్లమిల్లి ఒకరోజు దినచర్యను పరిశీలించింది. ఆయన ఎంత బిజీగా ఉంటారో, ప్రజలతో ఎలా మమేకమవుతారో పరిశీలించింది. ఈ ఎన్నికల వేళ క్షణం తీరిక లేకుండా గడపడాన్ని గుర్తించింది. ఉదయం 5 గంటలకు నిద్ర లేచిన ఆయన ఆంధ్రజ్యోతి దినపత్రిక చదవడంతో దినచర్యను ప్రారంభిస్తున్నారు. ఆ తర్వాత అంతా బిజీబిజీగానే గడుపుతున్నారు. ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం రాత్రి భోజనం వరకు ఇంటి వద్దనే ఉన్నారు. ఆహారం విషయంలో నల్లమిల్లి అనేక జాగ్రత్తలు తీసుకుంటారు. ఉదయం రాగి జావ తర్వాత కొద్దిగా డ్రైఫ్రూట్స్ తీసుకోవడం ఆయనకు అలవాటు. ఉదయం ఇంటికి వచ్చిన కార్యకర్తలు, అభిమానులు తప్పనిసరిగా అక్కడ బ్రేక్‌ఫాస్ట్ చేయాల్సిందే.. ముందుగా ఆయన నుంచి వచ్చే మాట టిఫిన్ చేశారా అని.. మధ్యాహ్నం వచ్చిన వారికి భోజనం సాయంత్రం సమయంలో వచ్చిన వారికి స్నాక్స్ అందించడం ఆ కుటుంబానికి అలవాటు..తండ్రి నల్లమిల్లి మూలారెడ్డి నుంచి ఈ అలవాటు ఉంది..

● అనపర్తి

బిజీ షెడ్యూల్

ఉదయం 5 గంటలకు నిద్ర లేచిన నల్లమిల్లి కాలకృత్యాలు తీర్చుకున్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న ఫోన్లకు సమాధానాలు ఇస్తూ వార్తా పత్రికలపై దృష్టి సారించారు. కుటుంబ సభ్యులతో కలిసి అల్పాహారం స్వీకరించి ఇంటి ఆవరణలో ఉన్న కార్యాలయంలో నాయకులను, కార్యకర్తలను కలుసుకుని ప్రచారానికి వెళ్లారు. పది గంటలకు ఇంటి నుంచి వెళ్లిన నల్లమిల్లి పలు గ్రామాల్లో పోలింగ్ ప్రక్రియకు అనుసరించాల్సిన అంశాలపై చర్చలు జరిపి ఒంటి గంటకు ఇంటికి చేరుకున్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం 3 గంటలకు పెదపూడి మండలంలో రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరితో కలిసి రోడ్‌షో నిర్వహించారు. రాత్రి 10 గంటలకు ప్రచారం ముగించుకుని 11 గంటలకు ఇంటికి వచ్చారు..


అన్ని వర్గాల ప్రజలు నష్టపోయారు


ఎన్నికల ప్రచారంలో..

వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు నష్టపోయారని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కుల వృత్తుల వారికి ఎంతో ఆదరణ లభించేదని చెప్పారు. బీసీలకు ఇచ్చే కోట్లాది రూపాయల ఉపకరణాలు గొడౌన్లలో శిథిలమయ్యాయని ఎస్సీలకు రావాల్సిన 27 పథకాలు జగన్‌రెడ్డి రద్దు చేశారని అన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు నాలుగు మండలాలలో వరుస ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటూనే ఒక వైపు నాయకులతో భేటీ అయి వారికి తగిన సలహాలు సూచనలు అందిస్తున్నారు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి..

కూటమి అధికారం ఖాయం


కుటుంబంతో..


ప్రచారానికి వెళ్తూ..

ఈ ఎన్నికలలో కూటమి విజయం సాధించడం ఖాయం. అనపర్తిలో బీజేపీ అభ్యర్థిగా నేను..పార్లమెంట్ అభ్యర్థిగా పురందేశ్వరి విజయం సాధించడం ఖాయం. 2014 నుంచి 19 వరకు ఎమ్మెల్యేగా నేను చేసిన అభివృద్ధి మినహా ఇతర అభివృద్ధి ఏమీ లేదు. ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి శూన్యం. ఈ సారి నేను అధికారం చేపట్టిన తర్వాత ఏళ్ల తరబడి ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు తొలగించేందుకు కెనాల్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తాను. అదే విధంగా అనేక రోడ్లు ఛిద్రంగా ఉన్నాయి. వాటి నిర్మాణానికి కృషి చేస్తా..పెదపూడి మండలంలో రైతులు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడి తొలగించే దిశగా కృషి చేస్తాను. రంగంపేట మండలంలో నేను ఎంతో కష్టపడి ఏర్పాటు చేసిన అపరాల కొనుగోలు కేంద్రానికి పూర్వ వైభవం తీసుకువస్తాను. చాగల్నాడు ఎత్తిపోతల పథకం రూపు రేఖలు మార్చి రంగంపేట మండల రైతులకు నీటి ఎద్దడి లేకుండా చేస్తాను..

– నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

కాంగ్రెస్‌తోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు


నిడదవోలులో ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గిడుగు

రాజమహేంద్రవరం సిటీ, మే 10: భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని దేశంలోను, రాష్ట్రంలోను పరిరక్షించాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే మార్గమని ఆ పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. శుక్రవారం నిడదవోలులో ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి సుబ్బారావుతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీవెళ్లి మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. అనంతరం సుబ్బారావు ఆధ్వర్యంలో వస్త్రావ్యాపారులతో గిడుగు భేటీ అయ్యారు. మధ్యాహ్నం స్థానిక మసీదు పెద్దలు ఇమామ్‌లతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గిడుగు రుద్రరాజు పదేళ్ల బీజేపీ పాలనలో ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, రాష్ట్రానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేశాయన్నారు. విభజన హామీలు, ప్రత్యేక హోదా వంటివాటిని నేరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా పాటు విభజన హామీలు నెరవేర్చుతారని, పోలవరాన్ని పూర్తి చేస్తామని, ప్రభుత్వ రంగ సంస్థలను రక్షిస్తారని, కేజీ టూ పీజీ విద్య, వైద్యం, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాలు సమర్థవంతంగా అమలు చేస్తారని, కాంగ్రెస్ అభ్యర్థులను హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

ప్రజల ఆదరణ జీవితంలో మరువలేను

● నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా: కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి మే 10: గత ఐదేళ్లుగా వైసీపీ అరాచకాలు దాష్టికాలపై పోరాటం చేస్తున్న తనకు మద్దతు పలుకుతూ ఎన్నికల సమయంలో అభ్యర్థిత్వంపై వైసీపీ ఎన్ని కుట్రలు పన్నినా తన న్యాయ పోరాటానికి అండగా నిలిచి కూటమి అభ్యర్థిగా నన్ను ఆశీర్వదిస్తున్న ప్రజల ఆదరణ జీవితంలో మరువలేనని ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పెదపూడి మండలం పె ద్దాడ, పెదపూడి, దోమాడ గ్రామాలలో ఆయన రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి, సినీ హీరో ఆర్యన్ రాజేష్ లతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. దారి పొడవునా మహిళలు హారతులు పడుతూ ఘనస్వాగతం పలి కారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణచౌదరి మాట్లాడు తూ వైసీపీ అవినీతి ఆరాచక పాలనకు చమరగీతం పాడాలని మరోసారి వైసీపీకి చాన్స్ ఇస్తే ప్రజల ఆస్తులు గల్లంతవడం ఖాయమని ఓటర్లు విజ్ఞతతో ఆలోచన చేసి ఓట్లు వేయాలని అన్నారు. నల్లమిల్లి మాట్లాడుతూ అనపర్తి నియోజకవర్గంలో కూటమి విజయం తథ్యమని ఐదేళ్లుగా ప్రజలు స్వాతంత్ర్యం కోల్పోయి జీవిస్తున్నారన్నారు. ప్రజలను భయభ్రాంతులను చేసి అక్రమ కేసులు పెట్టించి రాచరిక పాలన సాగించారని అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా రైతులు భూములు కాజేసేందుకు వైసీపీ పెద్దకుట్ర పన్నిందని రైతులు ఈ విష యాన్ని పరిశీలించి ఓటు వేయాలని అన్నారు. పెదపూడి మండలంలో రోడ్‌షోలో పాల్గొన్న హీరో ఆర్యన్ రాజేష్ ఓట ర్లను ఆకట్టుకుంటూ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

పెదపూడిలో వైసీపీ నుండి టీడీపీలోకి భారీ చేరికలు

ఎన్నికల సమయం రెండు రోజులకు దగ్గర పడినా అనపర్తి నియోజకవర్గంలో నేటికీ వైసీపీ నుండి టీడీపీ జనసేన బీజేపీలో చేరికలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. శుక్రవారం పెదపూడిమండలంలో జరిగిన రోడ్‌షో సందర్భంగా పెదపూడికి చెందిన వైసీపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో టీడీపీ లో చేరారు. వీరికి రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, ఎన్డీయే కూటమి అభ్యర్థి నల్లమిల్లి పార్టీ జెండాలు కప్పి ఆహ్వానించారు

బీజేపీలో చేరిన కొమరిపాలెం వైసీపీ నేతలు

బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు రాష్ట్ర సర్పంచ్‌ల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు పడాల వెంకటరామారెడ్డి పడాల రాము ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. వీరికి కూటమి అభ్యర్థి నల్లమిల్లి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


పెదపూడిలో టీడీపీలో చేరిన కార్యకర్తలతో కూటమి అభ్యర్థి నల్లమిల్లి, రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బీవీఆర్ చౌదరి


పెదపూడిలో మాట్లాడుతున్న బీవీఆర్ చౌదరి, కూటమి అభ్యర్థి నల్లమిల్లి, జనసేన నాయకుడు రావాడ నాగు

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేశాం

● సమావేశంలో రాజమహేంద్రవరం సిటీ ఆర్‌వో దినేష్ కుమార్



రాజమహేంద్రవరం సిటీ, మే 10 : రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం పరిధిలో ఎన్నికలు సజావుగా సాగేందుకు సర్వం సిద్ధం చేశామని ఆర్‌వో దినేష్ కుమార్ తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్‌వో కార్యాలయంలో శుక్రవారం సెక్టర్ అధికారులు, ఐటీ టీమ్‌లు, అన్ని విభాగాల అధికారులతో ఆర్‌వో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్‌వో మాట్లాడుతూ హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకొన్న వారి వివరాలను ఎలక్టోరోల్‌లో సక్రమంగా నమోదు చేసి తగినన్ని మార్క్‌డ్ కాఫీ ఆఫ్ ఎలక్ట్రోరోల్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ చేసే రోజున ఎన్నికల సంఘం నిర్దేశించిన బీఎల్‌వో యాప్, సువిధ యాప్ తదితర యాప్‌లను సబంధిత సిబ్బంది ఉదయం 9గంటలకు పూర్తిచేయాలని అన్నారు. శనివారానికి ఎన్నికల సామగ్రి పోలింగ్ స్టేషన్లవారీగా విడదీసుకుని పంపిణీకి సిద్ధం చేయాలని ఎవరికి సామగ్రి తక్కువ ఇచ్చామనే భావన రాకూడదన్నారు. అలాగే సెక్టారు అధికారుల వద్ద ఎన్నికల సామగ్రి ఒక సెట్టు ఉంచాలని అవసరమైన చోట వారు వాటిని పీవోలకు అందజేయాలన్నారు. ఎస్‌కేవీటీ డిగ్రీ కాలేజీలో ఈనెల 12న ఎన్నికల సామాగ్రి పంపిణీకి, పోలింగ్ అనంతరం 13న రాత్రికి నన్నయ యూనివర్శిటీలో తిరిగి తీసుకోవటానికి కౌంటర్లు ఏర్పాటు చేశామని అన్నారు. పోలింగ్ స్టేషన్లలో ఎన్నికల సంఘం నిర్దేశించిన అన్ని సౌకర్యాలను ఏర్పాటుచేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఆర్.శేషగిరిరావును ఆదేశించారు. వెబ్ కాస్టింగుకు తగిన ఏర్పాట్లు చేసే బాధ్యతను ఈఈ మదర్సా అలీకి అప్పగించారు. ఎన్నిలక సిబ్బందికి ఈనెల 12, 13 తేదిలలో అల్పాహారం, భోజనాలు ఏర్పాటు చేయాలని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వినూత్నను ఆదేశించారు. విటన్నింటిని పర్యవేక్షించే బాధ్యతను ఎస్ఈ జి.పాండురంగారావు, అదనపు కమిషనర్ పీఎం సత్యవేణిలకు అప్పగించారు. ఈ సమావేశంలోఅదనపు కమిషనర్ పిఎమ్ సత్యవేణి, డిప్యూటి కమీషనర్ ఎస్వీ రమణ, ఎస్ఈ పాండురంగారావు, సిటీ ప్లానర్ జీవిఎస్ఎన్ మూర్తి , తహశిల్దార్ జె ఆంజనేయులు, ఈఈలు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పలువురు న్యాయవాదులు జనసేనలో చేరిక

రాజమహేంద్రవరం సిటీ, మే 10: రాజమహేంద్రవరానికి చెందిన పలువురు న్యాయవాదులు జనసేన పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా శుక్రవారం చిట్టూరి వాసు ఆధ్వర్యంలో జనసేన సిటీ ఇంచార్జీ అనుశ్రీ సత్యనారాయణ సమక్షంలో వారంతా పార్టీలోకి చేరారు.వారికి పార్టీ కండువాలతో ఆహ్వానించారు. అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ స్వార్థం లేకుండాప్రజల కోసం పోరాడే నాయకుడు పవన్ కళ్యాణ్ అని ఆయన విధానాలు నచ్చి న్యాయవాదులు జనసేనలోకి చేరడం అభినందనీయమన్నారు.

ఓట్ల లెక్కింపు భద్రత ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ


నన్నయలో ఓట్ల లెక్కింపు భద్రత ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

దివాన్‌చెరువు, మే10 : కేంద్రఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఓట్లలెక్కింపునకు అన్ని విధాల తీసుకోవాల్సిన ఏర్పాట్లును సంబంధిత అధికారులతో కలసి పూర్తిచేసినట్లు జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. పోలింగ్ అనంతరం ఓట్లులెక్కింపునకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో భద్రతాపరంగా ఎటువంటి ఇబ్బందిలేకుండా చేయాల్సిన ముందస్తు ఏర్పాటైన రిసెప్షన్ కౌంటర్, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ డైవర్షన్ లు, ఆ ప్రదేశాలలో గల సీసీ కెమెరాలు, ఇతర భద్రతా ఏర్పాట్లు గురించి అధికారులతో కలసి శుక్రవారం స్వయంగా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు షిఫ్టులలో పోలీస్ భద్రతా, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణకు ఏర్పాట్లు చేశామని అన్నారు. కార్యక్రమంలో నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, రాజానగరం సీఐ కాశీవిశ్వనాథం పాల్గొన్నారు.

మద్దతివ్వండి.. సమస్యలు పరిష్కరిస్తా

● టైటిలింగ్ యాక్టుపై చర్చిద్దాం
● న్యాయవాదులతో పురందేశ్వరి

రాజమహేంద్రవరం, మే 10(ఆంధ్రజ్యోతి):'నాకు మద్దతివ్వండి. సమస్యలను పరిష్కరిస్తాను. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలపై కూడా చర్చిద్దాం. రాజ్యాంగబద్ధంగా ముందుకు వెళదాం' అని న్యాయవాదులతో కూటమి రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి, బీజేపీ రాష్ట్రాధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. శుక్రవారం ఆమె రాజమండ్రి బార్ అసోసియేషన్‌కి వెళ్లగా ఘనస్వాగతం లభించింది. బార్ అసోసియేషన్ తరఫున శాలువాతో సత్కరించారు. అనంతరం న్యాయవాదులను ఉద్దేశించి పురందేశ్వరి మాట్లాడారు. ప్రసిద్ధ కవులు, కళాకారులు, వీరేశలింగం వంటి సంఘ సంస్కర్తలు నడయాడిన నేల రాజమహేంద్రవరమని, ఇక్కడి బార్ అసోసియేషన్ చారిత్రాత్మకమైనదని ఆమె పేర్కొన్నారు. అలాంటి చోట ఎంపీగా పోటీలో ఉండడం తాను అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. తాను గెలిస్తే బార్ అసోసియేషన్ భవన నిర్మాణంతోపాటు న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. న్యాయవాదులు తన గెలుపునకు అండగా నిలవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్, ఉపాధ్యక్షురాలు స్వర్ణపాప, ప్రధాన కార్యదర్శి పిల్లారి రమేశ్, సంయుక్త కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు, ట్రెజరర్ కర్రా హనుమంతరావు, పుట్రేవు ప్రసాద్, నారాయణ స్వామి, ఎన్‌డీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


బార్ అసోసియేషన్‌లో మాట్లాడుతున్న పురందేశ్వరి

ఏజెన్సీ సమాచారం

దివ్యాంగుడిపై వైసీపీ ఎమ్మెల్సీ అనుచరుల దాడి

● పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగిన టీడీపీ నేతలు



పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగిన టీడీపీ శ్రేణులు

రాజవొమ్మంగి, మే 10 : అల్లూరి జిల్లా అడ్డతీగల మండలంలోని వైసీపీ ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ స్వగ్రామం ఎల్లవరంలో శుక్రవారం టీడీపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రచారానికి ఓ దివ్యాంగుడిపై వైసీపీ ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ అనుచరులు దాడిచేయడం, తీవ్ర గాయాలైన వ్యక్తినే పోలీసులు వచ్చి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొని వెళ్లారు. దీంతో పోలీస్‌స్టేషన్ ఎదుట శుక్రవారం ఉద్రిక్తత చోటుచేసుకొంది. ఎల్లవరంలో టీడీపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా, ప్రచారంలో ఉన్న మిరియాల రాజన్నదొర అనే దివ్యాంగుడు అక్కడ సమీపంలో ఉన్న వైసీపీ ఫ్లెక్సీని తొక్కి ధ్వంసం చేశాడనే నేపంతో దివ్యాంగుడిపై వైసీపీ ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ అనుచరులు దాడిచేశారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి తీవ్ర గాయాలైన యువకుడిని పోలీసుస్టేషన్‌కు తీసుకొని వెళ్లారు. దీంతో టీడీపీ శ్రేణులు పోలీసుస్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. పోలీసుల ఏకపక్ష వైఖరిపై టీడీపీ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అడ్డతీగల పోలీస్‌స్టేషన్ దగ్గర ఉద్రిక్త పరిస్థితులను తెలుసుకున్న రంపచోడవరం ఏఎస్పీ జగదీశ్ అదహళ్లి అడ్డతీగల పోలీసుస్టేషన్‌కు వచ్చి ఇరువర్గాలపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామని హామీ ఇవ్వడంతో టీడీపీ నేతలు ధర్నా విరమించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మిరియాల శిరీష దేవి అడ్డతీగల పోలీసుస్టేషన్ వద్దకు వచ్చి దివ్యాంగుడిపై దాడిచేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ ఎమ్మెల్సీ అరాచకాలు రోజురోజుకూ ఎక్కువ అవుతున్నాయని, ప్రజలు త్వరలోనే అనంతబాబు అరాచకాలకు చరమగీతం పాడనున్నారన్నారు.

సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

మోతుగూడెం, మే10: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయిలో సీఆర్పీఎఫ్ ఎఫ్/42 ఇన్‌స్పెక్టర్ సీపీ గౌడ ఆధ్వర్యమే మేరీలైఫ్ ఆప్లికేషన్ ప్లాన్ 2024కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహించారు. డొంకరాయి పోలీస్‌స్టేషన్ బస్టాండ్ మార్కెట్ సెంటర్ ఏరియాలో, రహదారులకు ఇరువైపులా ఉన్న చెత్తను ఊడ్చి శుభ్రం చేశారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ పి.శశికుమార్, ఎస్ఐ వినోద్‌కుమార్, ఏఎస్ఐ పి. ఏసుపాదం, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థులను గెలిపిస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

మోతుగూడెం, మే10: టీడీపీ అభ్యర్థులను గెలిపిస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మోతుగూడెం టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు అన్నారు. మోతుగూడెం ఎస్టీకాలనీ మార్కెట్ సెంటర్ గణేష్‌సెంటర్ గ్రామాల్లో ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే మిరియాల శిరీష, ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతను అభ్యర్థులు గెలుపు కోరుతూ ఇంటింటిప్రచారం చేశారు. చంద్రబాబుసూపర్‌సిక్స్ పథకాలతో మహిళలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పాసి రమణ, వార్డు మెంబర్ ఓలయ్య, టీడీపీ యూత్ భీమరాజు,రాంప్రసాద్,ఏసు,గంగాశ్రీను,అప్పన్న, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ కూటమి ర్యాలీ



చింతూరులో ఎన్‌డీఏ కూటమి ర్యాలీ

చింతూరు, మే 10 : చింతూరులో శుక్రవారం ఎన్‌డీఏ జమాల్‌ఖాన్ నేతృత్వంలో ర్యాలి నిర్వహించింది. కూటమి అబ్యర్థులు శిరీషదేవి, కొత్తపల్లి గీతలను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయుకులు టీడీపీ మండల అధ్యక్షుడు ఇల్ల చిన్నారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు డీవీఎస్ రమణారెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు మడవిరాజు పాల్గొన్నారు.

ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉండాలి

● రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం, మే 10: ఈ నెల 13వ తేదీన నిర్వహించే సార్వత్రిక ఎన్నికలకు సెక్టార్, రూట్ అధికారులు సిద్ధంగా ఉండాలని రిటర్నింగ్ అధికారి ఎస్. ప్రశాంత్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్యతో కలిసి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో రిసిప్షన్ సెంటర్ల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ 399 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలు, వీవీ ప్యాడ్లు, ఎన్నికల సామాగ్రి అందించేందుకు 23 కౌంటర్లు ఏర్పాటు చేశామని ఈ ప్రక్రియ ఆదివారం ఉదయం ప్రారంభం అవుతుందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో రెండు వెబ్ కాస్టింగ్ కెమెరాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఎన్నికల పోలింగ్‌శాతం, ఎన్నికల సరళిపై యాప్‌ను పొందుపరిచినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల సమస్యలు పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్లు ఎ.కృష్ణజ్యోతి, ఏవీ రమణ, చలపతిరావు, డీవీ సత్యనారాయణ, సత్య సులోచన, మురళీకృష్ణ, నాగమణి, నాగరాజు, డీటీలు బి.రాజు, శివ, శ్రీధర్, స్వామి, చైతన్య, వీరభద్రరావు, బాలాజీ, సరిత, రవీంద్రబాబు, సుధాకర్‌బాబు, ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

గోవిందగిరిలో అక్షయ తృతీయ ప్రత్యేక పూజలు

రంపచోడవరం, మే 10: మండలంలోని ఐ.పోలవరం గోవిందగిరి వెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం అక్షయ తృతీయ సందర్భంగా విశేష పూజలు, నిత్య పూజ కైంకర్యాలతో పాటు అభిషేక కార్యక్రమాలు నిర్వహించినట్లు ధర్మ ప్రచార మండలి సమన్వయకర్త నల్లమిల్లి వెంకట రామారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారి నారాయణరాజు, వేదపండితులు సాయిరామశర్మ, అర్చకులు గోవర్ధనం, మణికంఠచార్యులు, యజ్ఞసూర్య సాయికిరణ్, మంతా సత్యనారాయణసిద్ధాంతి పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను మెజార్టీతో గెలిపించాలి

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మిరియాల శిరీషాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న మిరియాల శిరీషాదేవి

రంపచోడవరం, మే 10: ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని రంపచోడవరం కూటమీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మిరియాల శిరీషదేవి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆమె విలేఖరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అర్హులందరికి అందేలా కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కావాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కార్య క్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చిన్నం బాబురమేష్, వంతల రాజేశ్వరి, అబ్బర్వర్లు హర్షవర్ధన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో పురందేశ్వరి కుమార్తె నివేదిత ప్రార్థన



చర్చిలో ప్రార్థన చేస్తున్న నివేదిత

రాజమహేంద్రవరం అర్బన్, మే 10 : రాజమహేంద్రవరం క్వారీ రోడ్డులోని బైబిల్ మిషన్ చర్చిలో శుక్రవారం జరిగిన ప్రార్థనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంట్ కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి కుమార్తె నివేదిత పాల్గొన్నారు. పాస్టర్ ప్రార్థన చేసి ఆశీర్వదించారు.

వీసీ పదవిని బాధ్యతగా భావిస్తున్నా

● నన్నయ ఉపకులపతి పద్మరాజు

దివాన్‌చెరువు, మే 10: వీసీ పదవిని హోదాగా కాకుండా బాధ్యతగా భావిస్తూ నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పద్మరాజు బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా శుక్రవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి విశ్వవిద్యాలయం ఔన్నత్యాన్ని పెంపొందించామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డీన్స్ పి.సురేష్‌వర్మ, కె.శ్రీరమేష్, వై.శ్రీనివాసరావు, కె.రమణేశ్వరి, ప్రిన్సిపాల్‌లు డి.జ్యోతిర్మయి, పి.విజయ నిర్మల, పి.వెంకటేశ్వరరావు, టి.అశోక్, ఎం.కమలకుమారి, తదితరులు ప్రసంగించారు. నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది హాజరయ్యారు. ఏడాదికాలంగా విజయవంతంగా పాలన అందించిన వీసీ పద్మరాజును విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సన్మానించారు.



పిడింగొయ్యి పంచాయతీ పరిధిలో గుమ్మడికాయలతో హారతి ఇస్తున్న మహిళలు



రూరల్ మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న గోరంట్ల



గోరంట్లకు ప్రచారంలో హారతులు పడుతున్న మహిళలు



ప్రచారం నిర్వహిస్తున్న గోరంట్ల కుమార్తె కంఠమనేని శిరీష

రానున్నది కూటమి ప్రభుత్వమే...

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆయన కుమార్తె శిరీషల ప్రచారం

కడియం/రాజమహేంద్రవరంరూరల్, మే 10: రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని బుచ్చయ్యనగర్, శ్రీలక్ష్మీకాలనీ, గణేష్‌నగర్, అరవింద్‌నగర్‌లలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆయన కుమార్తె కంఠమనేని శిరీషలు ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. గోరంట్ల మాట్లాడుతూ ప్రజలకు మంచి రోజుల రాబోతున్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వం పాలనలో అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, రానున్నది కూటమి ప్రభుత్వం అన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి, పోటీచేస్తున్న తనకు తెలుగుదేశం-సైకిల్ గుర్తుపైనా, ఎంపీ అభ్యర్థినిగా పోటీ చేస్తున్న దగ్గుబాటి పురందేశ్వరికి బీజేపీ-కమలం గుర్తుపైనా ఓటేసి విజయం చేకూర్చాలని గోరంట్ల విజ్ఞప్తి చేశారు.

తండ్రి విజయానికి తాను సైతం....

ఆరు సార్లు ఎమ్మెల్యేగాను.. ఒక పర్యాయం మంత్రిగాను.. పదోసారి ఎన్నికల పోటీలో నిలిచిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్యచౌదరి విజయానికి తన కుమార్తె కంఠమనేని శిరీష ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహిస్తున్నారు. ఏ గ్రామంలో నిర్వహించాలి ? అనే విషయాన్ని ముందురోజు ప్రణాళిక వేసుకుని అందుకు అనుగుణంగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులకు సమాచారం అందించి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు, తరువాత 4 గంటల నుంచి రాత్రి 9, 10 గంటల వరకు పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం చేస్తున్నారు. ఉమ్మడి మెనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఒక్కోసారి తండ్రితో పాటు, ఒక్కోసారి తాను ప్రచారం నిర్వహిస్తున్నారు. నందమూరి తారకరామారావు స్ఫూర్తితో రాజకీయ ప్రవేశంచేసిన తన తండ్రి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎన్టీఆర్ ప్రభుత్వంలోనూ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ప్రభుత్వంలోనూ ఎమ్మెల్యేగా, మంత్రిగా ఆటు రాజమహేంద్రవరం సిటీ, ఇటు రాజమహేంద్రవరంరూరల్ ప్రాంతాలను అభివృద్ధి చేశారంటున్నారు. మరింత అభివృద్ధి జరగాలంటే తెలుగుదేశం- సైకిల్ గుర్తుపై ఓటేసి తన తండ్రి బుచ్చయ్యచౌదరికి, ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న దగ్గుబాటి పురందేశ్వరి బీజేపీ -కమలం గుర్తుపైనా ఓటేసి విజయాన్ని అందించాలని, కూటమిని అధికారంలోకి తీసుకు రావాలని కంఠమనేని శిరీష ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎర్రకొండపై ప్రచారంలో శిరీష

ధవళేశ్వరం: సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి తన తండ్రి గోరంట్ల బుచ్చయ్య చౌదరిని గెలిపించాలంటూ కుమార్తె కంఠమనేని శిరీష ఎర్రకొండపై కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. అసెంబ్లీ అభ్యర్థిగా గోరంట్ల బుచ్చయ్య చౌదరికి సైకిల్ గుర్తుపై, పార్లమెంట్ అభ్యర్థిగా పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓట్లువేసి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మజ్జి పద్మ, ఎన్. ప్రియాంక, ఆళ్ళ ఆనందరావు, నాళ్ళ రమేష్, దొడ్డి బాబ్జి, ఇళ్ళరాంబాబు, దూది సాయి, ఆవాల శివ, బీరా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచించండి .. నిర్ణయాలు తీసుకోండి... కూటమిని గెలిపించండి

● అభివృద్ధికి, సంక్షేమానికి కట్టుబడి ఉంటాం
● రోడ్ షోలో సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి



రోడ్ షోలో మాట్లాడుతున్న అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, మే 10 : విజ్ఞులైన రాజమహేంద్రవరం ప్రజలారా... ఆలోచించండి.....నిర్ణయాలు తీసుకోండి..... టీడీపీ, జనసేన బీజేపీ కూటమిని గెలిపించండి అని సిటీ నియోజకవర్గ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎంపీ కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరిలు కోరారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం స్థానిక 34, 35, 36, 39, 41 డివిజన్లలో రోడ్ షో నిర్వహించారు. తొలుత శేషయ్యమెట్ట నుంచి రోడ్‌షో ప్రారంభమైంది. అక్కడి నుంచి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, జనసేన సిటీ ఇంచార్జీ అనుశ్రీ సత్యనారాయణ, నగర అధ్యక్షుడు వై.శ్రీను, బీజేపీ సిటీ ఇంచార్జీ యెనుముల రంగబాబు, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు టీడీపీ,నాయకులు, కార్యకర్తలలతో కలిసి రోడ్ షో చేశారు. ఆర్యాపురం ఫైర్ స్టేషన్ మీదుగా సాయి ఆసుపత్రి రోడ్డు, వడ్డీల పేట మలుపు నుంచి ఆర్యాపురం ఎస్ఆర్‌సీపీ రోడ్డు మీదుగా ఆర్యాంపురం సత్యనారాయణస్వామి దేవస్థానం, గాంధీ బొమ్మసెంటర్ మీదుగా గోకవరం బస్టాండ్, లేపాక్షి సెంటర్ మీదుగా కోర్లంపేట, తుమ్మలావ సాయిబాబా ఆలయంరోడ్డు మీదుగా రామచంద్రరావుపేట, లింగంపేట, కృష్ణనగర్ తదితర ప్రాంతాలలో రోడ్ షో నిర్వహించారు. ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. నియంత జగన్‌తో గత ఐదేళ్లుగా యుద్ధం చేస్తున్నామన్నారు. ఈ యుద్ధం అంతిమదశకు చేరుకుందన్నారు. ఇప్పుడు చాలా జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయం తీసుకోకపోతే జగన్ మళ్లీ వస్తే మన బతుకులు చిద్రం కాకతప్పదన్నారు. భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. మొన్నపడిన అర్థగంట వర్షానికి రాజమహేంద్రవరం పరిస్థితి ముఖ్యం ఈప్రాంతాల పరిస్థితి మనం చూసాం కాబట్టి వైసీపీని ఓడించాలన్నారు. లేకుంటే ఈవిదుల్లో తిరడానికి భరత్ రామ్ పడవలు కొనిఇస్తాడన్నారు. నగరపాలక సంస్థ నిధులతో అనాలోతంగా నిర్ణయాలు తీసుకుని డివైడర్లు, ఫైట్‌చేసి, ఫుట్ పాత్‌లు ఫైట్ చేసి, నగరాన్ని మురికి కూపంగా మార్చేశాడన్నారు. తాము గెలిస్తే ఈ ప్రాంతంలో ముంపు సమస్య శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. చంద్రబాబు పాలనలో ప్రతిఒక్కరికి మేలు జరిగిందని అటువంటి పాలన కావాలంటే ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు సైకిల్ గుర్తుపైన, ఎంపీగా దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపైన ఓట్లు వేయాలని కోరారు. నగరాన్ని హెల్త్ సిటీగాను, టూరిజం హబ్‌గాను, స్పోర్ట్స్ హబ్‌గాను, మహిళ రక్షణదళం ఏర్పాటు వంటి వి పక్కాగాచేసి చూపిస్తామన్నారు. పేదలకు మేలు చేయడం, సంక్షేమం అభివృద్ధి అందిచడం ప్రధానంగాని స్థానికత్వం కాదన్నారు. అనంతరం దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ మాట్లాడితే స్థానికేతరులు అని తనను సంబోదిస్తున్న భరత్ రామ్ అతను స్థానికుడై ఉండి చేసింది ఏమిటని ప్రశ్నించారు. రాజమహేంద్రవరాన్ని ముంపుబారిన పడేయ్యడమేనా అని ప్రశ్నించారు. ప్రతి పేదవారికి న్యాయం జరగాలన్నారు. నగరంలో ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో కలిసి రాజమహేంద్రవరం అభివృద్ధికి తాను కట్టుబడి ఉంటామన్నారు. 25 శాతం కమిషన్‌ను జేబిలో వేసుకోవడానికి పనిచేసిన వారు కూడా మాట్లాడుతున్నారని విమర్శించారు. కూటమిని అధికారంలోకి తీసుకురావాలని అందుకోసం ఈనెల 13న ఎండ కాసినా, వాన కురిసిన పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటును కమలం గుర్తుపై వేసి తనను, రెండోవ ప్రాధాన్యత ఓటు సైకిల్‌పైవేసి ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకీరామయ్య, మాజీ కార్పొరేటర్లు రెడ్డి పార్వతి, తంగేళ్ళ బాబి, నాయకులు కరగాని వేణు, కందికొండ అనంత్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేలంగి శ్రీదేవి, బీజేపీ నాయకులు అడబాల రామకృష్ణారావు, జనసేన నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.







ఆర్యాపురం రోడ్ షోలో ఓటర్లకు నమస్కరిస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్, పురందేశ్వరి , పాల్గొన్న మహిళలు, కార్యకర్తలు

జగన్‌ను గద్దెదించుతాం

● అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పురెడ్ల

రాజమహేంద్రవరం సిటీ, మే 10: అగ్రిగోల్డ్ బాధితులను మోసం చేసిన సీఎం జగన్‌రెడ్డిని గద్దెదింపుతామని, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరీలను గెలిపించుకుంటామని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పురెడ్ల శేషకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖాతాదారులతో సుమారు రూ.7వేల కోట్లు కట్టించుకున్న అగ్రిగోల్డ్ 2017లో బోర్డు తిప్పేసిందని అప్పటి టీడీపీ ప్రభుత్వం అగ్రిగోల్డ్ ఆస్తులను సీజ్‌చేసి తమకు న్యాయం చేస్తామని, డబ్బులు ఇపిస్తామని చెప్పిందన్నారు. అగ్రిగోల్డ్ బాధితులంతా విజయవాడలో ఆందోళన చేపడితే అప్పటి ప్రతిపక్ష నాయకుడు జగన్ తమ శిబిరం వద్దకువచ్చి బాధితులు ఒక్కొక్కరికి రూ.3లక్షలు కాదు రూ.10లక్షలు నష్టపరిహారంగా ఇపిస్తానని హామీ ఇచ్చారని, తమ డబ్బు వడ్డీల్లో పెట్టి ఇప్పిస్తామని చెప్పారని ఆయన గుర్తుచేశారు. దీంతో అగ్రిగోల్డ్ బాధితులు ఓట్లువేసి గెలిపిస్తే అధికారంలోకి వచ్చాక కేవలం రూ.10వేలు మొక్కుబడిగా ఇచ్చి చేతులు దులుపుకున్నారని తమకు అన్యాయం చేశారన్నారు. ఈ సమస్యను సిటీ కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్తే ఆయన వెంటనే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లారని ఆయన స్పందించి న్యాయం చేస్తానని మాట ఇచ్చారని చెప్పారు. అందుకే తామంతా కూటమిని గెలిపిస్తామన్నారు.

ఇదేనా పరిశుభ్రత!

● సీనియర్ డీసీఎం రాంబాబు అసహనం
● రైల్వే స్టేషన్ తనిఖీ

రాజమహేంద్రవరం, మే 10(ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్లో అపరిశుభ్రతపై సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలాపల్లి రాంబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన రైల్వేస్టేషన్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సెల్ కిచెన్, ఆహారం రెస్టారెంట్ కిచెన్లను, ఆహార పదార్థాలను పరిశీలించారు. విజయ డైరీ ఉత్పత్తులపై ఎక్స్‌పైరీ తేదీలను, స్టాల్స్‌లో భోజనం బరువును గమనించారు. ప్రయాణికులు వేచివుండే గదులు, మరుగుదొడ్లు పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. రైల్వే స్టేషన్‌లోని డస్ట్‌బిన్లు నిండిపోయి దుర్వాసన వస్తుండడం, ప్లాట్‌ఫాంలు, ట్రాక్‌లు, గదులు పరిశుభ్రంగా లేకపోవడంపై హెచ్ఐ శ్రీరాములును ప్రశ్నించారు. తాగునీటిని పరిశీలించి.. నిబంధనల ప్రకారం నమూనాలను ల్యాబ్‌కి పంపించి టీడీఎస్ తదితర టెస్ట్‌లు చేయించి ఫలితాలు నమోదుచేసిన రిజిస్టరును తనకు చూపించాలని సూచించారు. సంబంధిత అధికారులు రిజిస్టరును తీసుకురాలేదు. పార్శిల్ కార్యాలయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. తాగునీటి కొరత, బోగీల్లో విపరీతమైన రద్దీ, ఆహారం నాణ్యత, అదనపు ధరలపై రైల్ మదద్‌కి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని.. వాటిని తగ్గించడానికి కృషి చేయాలన్నారు. ప్రయాణికులకు నాణ్యతా ప్రమాణాల ప్రకారం పదార్థాలను అందించకపోతే చర్యలు తప్పవన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పరిశుభ్రతను పాటించి తీరాల్సిందేనని ఆదేశించారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీరు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. భద్రతా విషయంలో పూర్తి సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. తొలుతగా రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పాటు చేసిన తాగునీటి కేంద్రం వద్ద కాసేపు ప్రయాణికులకు తాగునీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెడ్ క్వార్టర్స్ సీసీఐ సుభాని, శివ, రాజమండ్రి ఎస్ఎస్ రంగనాథ్, సీటీఐ చంద్రమౌళి, సీసీఐ కల్యాణ్ కుమార్, క్యాటరింగ్ ఇన్‌స్పెక్టర్ దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనకు పట్టం కట్టండి

● జేఏసీ కన్వీనర్ దాసరి రాము

రాజానగరం, మే 10 : ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీకి ఓటేసి రాజానగరం కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణను గెలిపించాలని తెలగ బలిజ కాపు జేఏసీ కన్వీనర్ దక్షిణ భారతదేశ కన్వీనర్ దాసరి రాము పిలుపునిచ్చారు. నియోజకవర్గ కేంద్రమైన రాజానగరం జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు గురించి సమావేశంలో నాయకులకు వివరించారు. తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించానన్నారు. ఇప్పటివరకు రాజోలు, పి.గన్నవరం, కాకినాడ, పిఠాపురం ప్రాంతాల్లో ఎస్సీ, బీసీ, కాపు నాయకులను కలిసి జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు గురించి చర్చించానన్నారు. రాజానగరంలోని బీసీ, ఎస్సీ నాయకులతో కలిసి జనసేన పార్టీకి మద్దతుగా నిర్వహించామన్నారు.

'క్రైస్తవులకు న్యాయం చేయండి'

రాజమహేంద్రవరం సిటీ, మే 10: ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా రాజమహేంద్రవరం సిటీ, రూరల్‌లో క్రైస్తవులకు న్యాయం చేయాలని సిటీ పాస్టర్స్ అండ్ చర్చ్ అసోసియేషన్ రాజమహేంద్రవరం అధ్యక్షుడు పొన్నమాటి బాబ్జీ కోరారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యేసుక్రీస్తు కృపతో రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని ప్రార్థిస్తున్నామన్నారు. వచ్చే ప్రభుత్వం ఏదైన క్రైస్తవుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. నగరం, రూరల్‌లో రెండు చోట్ల 10 ఎకరాల చొప్పున సమాధుల భూమి (బరియల్ గ్రౌండ్) ఏర్పాటు చేయాలన్నారు.

కుటుంబం అంతా నిత్యం ప్రజల్లోనే

● ఎన్నికల ప్రచారంలో బత్తుల కుటుంబం



తోకాడలో జనసేనలో చేరిన నాయకులతో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ

దివాన్‌చెరువు/రాజానగరం, మే 10: ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలలో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న బత్తుల బలరామకృష్ణతో పాటు వారి కుటుంబ సభ్యులు, బంధువులు కూడా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఇంటింటా ఎన్నికల ప్రచారం విస్తృతంగా చేస్తున్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, సతీమణి వెంకటలక్ష్మి, కుమార్తెలు బత్తుల వందనాంబిక, తోట ప్రత్యూషదేవి, అల్లుడు తోట పవన్‌కుమార్, వియ్యంకుడు తోటరాజు నియోజకవర్గం పరిధిలోని రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లోని గ్రామాలలో దాదాపు గత రెండు సంవత్సరాలుగా మేముసైతం అంటూ వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువయ్యారు. కుటుంబ సభ్యులంతా ఎవరికి వారు వేర్వేరుగా మూడు మండలాల్లోని గ్రామాలలో పర్యటిస్తూ ప్రజలకు దగ్గరయ్యారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా మేమున్నామంటూ కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ భరోసా ఇస్తున్నారు. బలరామకృష్ణ చేస్తున్న సేవాకార్యక్రమాలు కారణంగానే జనసేనాని పవన్‌కళ్యాణ్ దృష్టిని ఆకర్షించి రాష్ట్రంలోనే తొలిసీటుగా రాజానగరంకు జనసేన అభ్యర్థిగా బత్తులను ప్రకటించడం విశేషంగా చెప్పవచ్చు. బలరామకృష్ణతోపాటు వెంకటలక్ష్మి, వారి కమార్తెలు రాత్రనక పగలనక నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. అలాగే కోట్లాది రూపాయల వ్యయంతో తన స్వగ్రామం గాదరాడలో పలు దేవాలయాలు నిర్మించి ఆధ్యాత్మికతను పెంపొందించారు. స్థానికులతోబాటు సుదూరప్రాంతాలకు చెందిన భక్తులు ఈ ఆలయాలకు వచ్చి దర్శించుకుని తరిస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రధానకూడళ్లలో ప్రత్యేక వాహనంద్వారా ఉచిత అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి అన్నదాత సుసుఖీభవ అంటూ ప్రజలాశీర్వాదాన్ని అందుకున్నారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లును కలిసి కూటమి మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. ఓటువేసే విధానాన్ని నమూనా ఈవీఎంలో ఓటర్లుకు వివరిస్తూ పోలింగ్ కేంద్రంలో ఇచ్చే రెండుఓట్లులో ఓకోటు ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందరేశ్వరికి 4వ నెంబరులో, రెండోఓటు ఎమ్మెల్యే అభ్యర్థి బలరామకృష్ణకు 5వ నెంబరులో వేసి ఆశీర్వదించాలని వివరంగా చెప్పి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. వీరు ఇప్పటికే పలుపర్యాయాలు ఇంటింటాప్రచారం చేస్తూ ఓటర్లను కలసి మద్దతు కోరారు. దీనికి తోడు నియోజకవర్గంలో అనేకగ్రామాలలో బత్తులకు బంధువర్గం అధికంగా ఉండడం కుడా కూటమిఅభ్యర్దుకు కలసివచ్చే అంశంగా పరిశీలకులు భావిస్తున్నారు. తమను ఎన్నికలలో గెలిపిస్తే రాజానగరం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శనియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ప్రజలకు హామీఇస్తున్నారు.



బత్తులను సత్కరిస్తున్న అభిమానులు



ప్రచారం నిర్వహిస్తున్న బత్తుల కుమార్తె వందనాంబిక



ప్రచారంలో నాయకుల కోలాహలం



ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో మీ భవిష్యత్తు, మీ బిడ్డల భవిష్యత్తుకు ఆలోచించి ఓటు వేయాలి. నా కష్టం, నా శ్రమ అంతా మీ, మీ బిడ్డల భవిష్యత్తు కోసమే.. మీ ఆశీస్సుల కోసం వచ్చా.. ఓటు వేసి ఆశీర్వదించండి. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు మీ ఓటు కీలకం.

ఆలోచించి.. ఓటేయండి!



జన..సేనుడు : రోడ్ షో, బహిరంగ సభకు వెల్లువలా తరలివచ్చిన జనం





నాకిది చాలన్నా : పవన్ వద్దకు రాగానే అంధురాలి ఆనందం



హత్తుకున్న పవన్ అభిమానం..



ఇదే టీమ్ : పవన్, శ్రీనివాస్, వర్మ అభివాదం



పవన్‌కు జేజేలు : పిఠాపురంలో పవన్‌కు జై కొడుతున్న జనం



మేమూ మీ వెంటే : పిఠాపురంలో పవన్‌కు మహిళల స్వాగతం



నీ చేయి తగిలినా చాలన్నా : పిఠాపురంలో యువత క్యూ

ఆంధ్రప్రదేశ్ దశ దిశ మార్చే ఎన్నికలివి..

- పిఠాపురాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతా
- ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ చేస్తా
- పురుషోత్తపట్నం వినియోగంలోకి తెస్తా
- సెజ్‌లో పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి
- ఉప్పాడ-కాకినాడ బీచ్‌ను అభివృద్ధి చేస్తా
- పిఠాపురం వారాహి సభలో పవన్‌కల్యాణ్

పిఠాపురం, మే 10: ఏపీ దశ దిశ మార్చే ఎన్నికలు ఇవి.. 25 ఏళ్ల ఏపీ భవిష్యత్తుకు మొదటి బీజం దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురాన్నే పడుతుంది.మోడల్ నియోజకవర్గంగా పిఠాపురాన్ని తీర్చిదిద్దుతా..అభివృద్ధి అంటే పిఠాపురంలా ఉం డాలని, పార్లమెంట్ అంటే కాకినాడ లోక్‌సభ నియోజకవర్గంలా ఉం డాలని దేశం మొత్తం ఇటు వైపు చూసేలా చేస్తానని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు.పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్ బంగారమ్మ రావిచెట్టు వద్ద శుక్రవారం రాత్రి జరిగిన వారాహి బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అద్భుతమైన పిఠాపురంగా తయారు చేయాలన్నదే తన ధ్యేయమన్నారు. పిఠాపురం పట్టణానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తామని, ఉప్పాడ రైల్వే గేటు వద్ద ఆర్వోబీ నిర్మాణం చేపట్టే బాధ్యత తాను తీసుకుంటానని తెలిపారు. పిఠాపురంలో విద్యుత్ వైర్లు బయటకు వేలాడుతూ కనిపిస్తున్నాయని..అవి బయటకు కనబడకుండా చేసే ఆలోచన చేస్తానని చెప్పారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ సహకారంతో ఏలేరు, సుద్దగడ్డ, పీబీసీ ఆధునికీకరణతో పాటు పురుషోత్తపట్టణం ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తెస్తామని తెలిపారు. నియోజకవర్గంలో సాగు,తాగునీటి సమస్యలు పరిష్కరిస్తామని, ప్రతి మండలంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తామని చెప్పారు. ఉప్పాడ నుంచి కాకినాడ వరకూ బీచ్ అభివృద్ధి చేసి దేశంలోని ప్రజలంతా ఇక్కడకు వచ్చేలా చేస్తామని తెలిపారు. కాకినాడ సెజ్‌లో 8 వేల ఎకరాలు సేకరించి ఇంకా పలువురు రైతులకు పరిహారం ఇవ్వలేదని, ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేదని, ఒక్క పరిశ్రమ తీసుకురాలేకపోయారని విమర్శించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సెజ్‌లో పరిశ్రమలు తీసుకువచ్చి పిఠాపురంతో పాటు కాకినాడ జిల్లా యువతకు ఇక్కడ ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. తనకు మద్దతుగా సాయిధరమ్‌తేజ్ ప్రచారానికి వస్తే అతడిపై వైసీపీ గూండాలు డ్రింక్ బాటిల్‌తో దాడి చేశారని, అది తగిలి తెలుగుదేశం తమ్ముడు నల్లల శ్రీధర్‌కు తీవ్ర గాయాలయ్యాయని..అతడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని తెలిపారు. వైసీపీ గూండాలను తాను హెచ్చరిస్తున్నానని..రాబోయే కూటమి ప్రభుత్వంలో వారికి తగిన శాస్తి చేస్తామని చెప్పారు. కులాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయం చేసేవాడిని కానని స్పష్టం చేశారు. పిఠాపురంలో తాను ఎందుకు నిలబడ్డానో తెలుసుకునేందుకు మే 13న ఇక్కడకు రావాలని తన భార్యను కోరినట్టు తెలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి అనేది కనిపించకుండా చేశారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ విమర్శించారు. ఐదేళ్లపాటు ఏనాడూ ప్రజలకు కనిపించని వంగా గీత నేడు ఎన్నికల వేళ ప్రజల ముందుకు వచ్చిందని ఎద్దేవా చేశారు. గీతకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్మ తనయుడు గిరీష్ వర్మ, జనసేన నాయకులు కడారి తమ్మయ్యనాయుడు పాల్గొన్నారు.

నెం 4పై నొక్కండి..

పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న తనకు చతుర్ముఖ బ్రహ్మలా బ్యాలెట్‌లో నాలుగో నెంబరులో ఉన్న గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేయాలని, కాకినాడ ఎంపీగా పోటీ చేస్తున్న తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కు తొమ్మిదో నెంబరులో ఉన్న గ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఉప్పొంగిన జనం..

పిఠాపురం/గొల్లప్రోలు/పిఠాపురం రూరల్/గొల్లప్రోలు రూరల్, మే 10 : జనకెరటం ఉప్పొంగింది. రహదారులన్నీ జాతరను తలపించాయి.ప్రజలు ఉప్పెనలా తరలివచ్చి పవన్‌కు నీరాజనాలు పలికారు. మహిళలు పూల వర్షం కురిపించి హారతులిచ్చారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ శుక్రవారం నిర్వహించిన రోడ్‌షోకు అపూర్వ స్పందన లభించింది. ఆర్వోబీ మీదుగా పిఠాపురం మండల పరిషత్ కార్యాలయం పక్క రోడ్డు నుంచి జగ్గయ్యచెరువు కాలనీ, పశువుల ఆస్పత్రి, అపార్ట్‌మెంట్లు, సామర్లకోట రోడ్డు, పాదగయ జంక్షన్ వరకూ రోడ్ షో సాగింది. సమయాభావంతో బైపాస్ రోడ్ మీదుగా పవన్ గొల్లప్రోలు చేరుకోగా పట్టణ రహదారులన్నీ జనసంద్రమయ్యాయి. పుర కార్యాలయం సెంటర్‌లో మహిళలు బెలూన్లతో స్వాగతం పలికారు. పలుచోట్ల చిన్నారులను ఎత్తుకున్నారు. చేబ్రోలు శివాలయం, మల్లవరం సెంటర్ మీదుగా ఏకే మల్లవరం, ఏపీ మల్లవరం గ్రామాల్లో రోడ్‌షో కొనసాగించారు. కొత్తపల్లి మండలంలో రోడ్‌షో కొనసాగింది. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన కొమ్మూరి గంగాధర్ తాను ల్యాండ్ టైటిలింగ్ చట్టానికి బాధితుడనని తెలుపుతూ చిత్రాడలో ప్లకార్డు ప్రదర్శించగా పవన్‌కల్యాణ్ స్పందించి ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని తెలిపారు.

6 గంటలు ఆలస్యంగా..

ఉదయం 9 గంటలకు రోడ్‌షో ప్రారంభమవుతుందని ముందుగా చెప్పినప్పటికీ ఆరు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది.ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురవడంతో హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అనుమతులు రావడంలో జాప్యం జరిగింది. దీంతో ఉదయం 10 గంటలకు గొల్లప్రోలు హెలిపాడ్‌కు రావాల్సిన పవన్ మధ్యాహ్నం 12.50 గంటలకు చేరుకున్నారు. అక్కడి నుంచి చేబ్రోలులోని నివాసానికి వెళ్లిపోయారు. మధ్యాహ్నం 2.50 గంటలకు ఆయన నివాసం నుంచి బయలుదేరి పిఠాపురం మండలం చిత్రాడ గ్రామానికి 3.20 గంటలకు చేరుకున్నారు. మహాలక్ష్మి ఆలయం నుంచి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, జానీ మాస్టర్‌లతో కలిసి రోడ్‌షో చేశారు.

జగన్‌కి మిగిలింది మూడు రోజులే

కూటమి గోపాలపురం అభ్యర్థి మద్దిపాటి



గోపాలపురంలో ర్యాలీ చేస్తున్న కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు చిత్రంలో పురందేశ్వరి తనయుడు హితేష్

గోపాలపురం, మే 10: పట్టెడన్నం పెట్టే రైతన్న కన్నీరు ఈ సమాజానికి మంచిది కాదని గోపాలపురం నియోజకవర్గ కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన గోపాలపురం నుంచి రాజంపాలెం వరకు ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. గ్రామ గ్రామాన మహిళలు, యువకులు పెద్ద ఎత్తున హాజరై అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. పెద్దగూడెంలో గజమాలతో స్వాగతం పలికారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పసుపు బెలూన్లతో అలంకరించిన ట్రాక్టర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మద్దిపాటి మాట్లాడుతూ ఆకలి తీర్చే రైతన్నకు జగన్ పరిపాలనలో కన్నీరే మిగిలిందన్నారు. గిట్టుబాటు ధరలు లేక పండించిన పంటను కొనుగోలు చేసేవారు లేక రైతు అప్పుల పాలై రాష్ట్రవ్యాప్తంగా 2200 మంది రైతులు ఆత్మ హత్యలు చేసుకున్నారన్నారు. దీంతో పలు కుటుంబాలు కుటుంబ పెద్దను కోల్పోయి రోడ్డున పడ్డాయన్నారు. జగన్ ప్రభుత్వం వేధింపులు తాళలేక రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో దళితులు, యువకులు ఆత్మ హత్యలు చేసుకున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని 9 లక్షల కోట్ల అప్పుల పాలు చేసిన ముఖ్యమంత్రి జగన్ అన్నారు. కూరగాయలు మొదలుకుని గ్యాస్,పెట్రోల్, డీజిల్, పప్పు, ఉప్పు ఇలా చెప్పుకుంటూ పోతే అన్నింటా పన్నులు పెంచి ప్రజలను నిలువునా దోపిడి చేసిన ముఖ్యమంత్రిని ఎవరు ఎప్పుడూ చూడలేదన్నారు. ఇక జగన్‌కి మిగిలింది మూడు రోజులేనని ఇక రాష్ట్రాన్ని వదిలి పారిపోయే సమయం దగ్గరపడిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి తనయుడు హితేష్, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి, మండల అధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు జ్యేష్ఠ శ్రీధర్, నందమూరి సత్యనారాయణ, టీడీపీ,బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నేడే ఆఖరు 6

ప్రచారానికి నేటితో తెర

ఎల్లుండే పోలింగ్


ప్రలోభాలతో వైసీపీ వల

ఇదేనా పరిశుభ్రత

రైల్వే స్టేషన్‌లో డీసీఎం తనిఖీలు

డెల్టా కాలువలకు నీరు నిలిపివేత

నేడు పిఠాపురానికి రామ్‌చరణ్



పిఠాపురం, మే 10: మెగా హీరో రామ్‌చరణ్ శనివారం పిఠాపురం రానున్నారు. తన తల్లి సురేఖతో కలిసి హైదరాబాద్ నుంచి పిఠాపురం రానున్న ఆయన ఉదయం 9.30 గంటలకు పాదగయ క్షేత్రాన్ని సందర్శించుకోనున్నారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరదేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవతయిన పురుహూతికాఅమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానాన్ని సందర్శించి పూజలు చేస్తారు. పూజలు తర్వాత జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను కలుస్తారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. ఇందుకు సంబంధించి నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 16,169

రాజమహేంద్రవరం,మే 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా 16,169 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించు కున్నారని జిల్లా ఎన్నికల అధికారి డా. కె.మాధవీలత తెలిపారు.ఈ మేరకు శుక్రవా రం ఒక ప్రకటన విడుదల చేశారు. అనపర్తిలో 1477, రాజానగం 1376, రాజ మండ్రి సిటీ 2848, రూరల్ 2558, కొవ్వూరులో 1527 మంది, నిడదవోలులో 1509 మంది, గోపాలపురంలో 1238 మంది ఓటు హక్కు విని యోగించుకున్నారన్నారు.

నల్లజర్లలో డీఎస్పీ ఉండగానే గొడవ జరిగిందా? 5

టీడీపీ..వైసీపీ గొడవపై స్పెషల్ బ్రాంచ్ పోలీసుల విచారణ

జగన్‌ను గద్దెదించుతాం

- అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పురెడ్ల

రాజమహేంద్రవరం సిటీ, మే 10: అ గ్రిగోల్డ్ బాధితులను మోసం చేసిన సీ ఎం జగన్‌రెడ్డిని గద్దెదింపుతామని, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ఆది రెడ్డి శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరీలను గెలిపించుకుంటామని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర ఉపా ధ్యక్షుడు పురెడ్ల శేషకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవా రం జరిగిన విలేకరుల సమావేశంలో ఆ యన మాట్లాడారు. ఖాతాదారులతో సు మారు రూ.7వేల కోట్లు కట్టించుకున్న అగ్రిగోల్డ్ 2017లో బోర్డు తిప్పేసిందని అప్పటి టీడీపీ ప్రభుత్వం అగ్రిగోల్డ్ ఆస్తులను సీజ్‌చేసి తమకు న్యాయం చే స్తామని, డబ్బులు ఇపిస్తామని చెప్పిందన్నారు. అగ్రిగోల్డ్ బాధితులంతా విజయవాడలో ఆందోళన చేపడితే అప్పటి ప్రతిపక్ష నాయకుడు జగన్ తమ శిబిరం వ ద్దకువచ్చి బాధితులు ఒక్కొక్కరికి రూ.3ల క్షలు కాదు రూ.10లక్షలు నష్టపరిహారంగా ఇపిస్తానని హామీ ఇచ్చారని, తమ డబ్బు పువ్వుల్లో పెట్టి ఇప్పిస్తామని చెప్పారని ఆయన గుర్తుచేశారు. దీంతో అగ్రిగోల్డ్ బాధితులు ఓట్లువేసి గెలిపిస్తే అధికారంలోకి వచ్చాక కేవలం రూ.10వేలు ముక్కుబడిగా ఇచ్చి చేతులు దులుపుకున్నారని తమకు అన్యాయం చేశారన్నారు. ఈ సమస్యను సిటీ కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్తే ఆయన వెంటనే టీడీపీ జాతీయ ప్రధాన కార్య దర్శి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లారని ఆయన స్పందించి న్యాయం చేస్తానని మాట ఇచ్చారని చెప్పారు. అందుకే తా మంతా కూటమిని గెలిపిస్తామన్నారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఇదేనా పరిశుభ్రత!

సీనియర్ డీసీఎం అసహనం.. రైల్వే స్టేషన్ తనిఖీ



పరిశుభ్రతపై సూచనలు చేస్తున్న సీనియర్ డీసీఎం రాంబాబు

రాజమహేంద్రవరం, మే 10(ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్లో అపరిశుభ్రతపై సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలాపల్లి రాంబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన రైల్వేస్టేషన్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సెల్ కిచెన్, ఆహారం రెస్టారెంట్ కిచెన్లను, ఆహార పదార్థాలను పరిశీలించారు. విజయ డైయిరీ ఉత్పత్తులపై ఎక్స్పైరీ తేదీలను, స్టాల్స్‌లో భోజనం బరువును గమనించారు. ప్రయాణికులు వేచివుండే గదులు, మరుగుదొడ్లు పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. రైల్వే స్టేషన్‌లోని డస్ట్‌బిన్లు నిండిపోయి దుర్వాసన వస్తుండడం, ప్లాట్‌ఫాంలు, ట్రాక్‌లు, గదులు పరిశుభ్రంగా లేకపోవడంపై హెచ్ఐ శ్రీరాములును ప్రశ్నించారు. తాగునీటిని పరిశీలించి.. నిబంధనల ప్రకారం నమూనాలను ల్యాబ్‌కి పంపించి టీడీఎస్ తదితర టెస్టులు చేయించి ఫలితాలు నమోదు చేసిన రిజిస్టరును తనకు చూపించాలని సూచించారు. అయితే సంబంధిత అధికారులు రిజిస్టరును తీసుకు రాలేదు. పార్శిల్ కార్యాలయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలిచ్చారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. తాగునీటి కొరత, బోగీల్లో విపరీతమైన రద్దీ, ఆహారం నాణ్యత, అదనపు ధరలపై రైల్ మదద్‌కి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని.. వాటిని తగ్గించడానికి కృషి చేయాలన్నారు. ప్రయాణికులకు నాణ్యతా ప్రమాణాల ప్రకారం పదార్థాలను అందించకపోతే చర్యలు తప్పవన్నారు. అలాగే ఎట్టి పరిస్థితుల్లోనూ పరిశుభ్రతను పాటించి తీరాలన్నారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీరు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. భద్రత విషయంలో పూర్తి సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. తొలుతగా రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పాటు చేసిన తాగునీటి కేంద్రం వద్ద కాసేపు ప్రయాణికులకు తాగునీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెడ్ క్వార్టర్స్ సీసీఐ సుభాని, శివ, రాజమండ్రి ఎస్ఎస్ రంగనాథ్, సీటీఐ చంద్ర మౌళి, సీసీఐ కళ్యాణ్‌కుమార్, క్యాటరింగ్ ఇన్స్‌పెక్టర్ దేవానంద్ పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు మేలు

శాసన మండలి మాజీ ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం



బూరుగుపల్లి శేషారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

పెరవలి, మే 10: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే బీసీలకు మేలు జరిగిందని శాసన మండలి మాజీ ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. కానూరులోని వైనాట్ ఫంక్షన్ హాలులో శుక్రవారం నిర్వహించిన బీసీల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్‌టీ రామారావు, చంద్రబాబు బీసీలకు రిజర్వేషన్లు తెచ్చారని, ప్రస్తుత సీఎం జగన్ బీసీ రిజర్వేషన్‌లో కోత విధించారన్నారు. 50కి పైగా కార్పొరేషన్లు పెట్టి కనీసం ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వని ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఉమ్మడి ప్రభుత్వం ద్వారానే బీసీలకు తగిన ప్రయోజనం కలుగుతుందని, రక్షణ లభిస్తుందన్నారు. అందువల్ల కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కూడా ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలకు 50ఏళ్లకే పెన్షన్ ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. బీసీలంతా ఐకమత్యంగా పనిచేసి కూటమి అభ్యర్థులు పురందేశ్వరి, కందుల దుర్గేష్‌లను గెలిపించాలని కోరారు. అనంతరం దుర్గేష్, బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీకి బీసీలే వెన్నెముక అని, వారి సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు మ్యానిఫెస్టోలో ప్రకటించిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు మాట్లాడుతూ బీసీల కోసం పనిచేసేది కూటమి ప్రభుత్వం మాత్రమేనని వారి రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తుందన్నారు. కార్యక్రమంలో పసలపూడి భద్రయ్య, బొడ్డు రామాంజనేయులు, రాచమళ్ల శ్రీను, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

గోపాలపురం, మే 10: పామాయిల్ గెలలు కోయడానికి వెళ్లి విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన తాళ్లపూడి మండలం సూరయ్యపేట గ్రామ శివారులో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. గోపాలపురం మండలం భీమోలు గ్రామానికి చెందిన వసంతాటి రాంబాబు(30) కూలిపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. శుక్రవారం ఉదయం సూరయ్యపేట గ్రామానికి చెందిన ఒక రైతు పొలంలో పామాయిల్ తోటలో గెలలు నరికేందుకు వెళ్లాడు. గెలలు కోస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి కుప్పకూలిపోయాడు. హుటాహుటిన రాంబాబుని గోపాలపురం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కాగా రాంబాబుకు భార్య నాగమణి, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కాంగ్రెస్‌తో అన్నివర్గాలకు మేలు

కొవ్వూరు, మే 10: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్నివర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని నియోజకవర్గ అభ్యర్థి అరిగెల అరుణకుమారి అన్నారు. మండలంలోని కాపవరంలో శుక్రవారం ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజుకు హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో గందం బాహుజీ, కొనిదెల శ్రీనివాసరావు, బొనిగే రాంబాబు, గెడ్డం సాయిబాబా, మహిధర్, అరిగెల శ్రీను, రాజు, రవి పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు



నల్లజర్ల, మే 10: మండలంలోని శింగరాజుపాలెంలో 50మంది వైసీపీ కార్యకర్తలు శుక్రవారం తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి జనసేన నాయకుడు బోలిశెట్టి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి, ఆవపాడు జనసేన సర్పంచ్ ఆచ్యుత సత్యనారాయణ సమక్షంలో జనసేనలో చేరారు. వైసీపీ విధానాలపై విసుగు చెందిన సచివాలయ కన్వీనర్లు, వార్డుమెంబర్లు, బూత్ ఏజెంట్లు జనసేనలోకి చేరడంతో గ్రామంలో జనసేన బలం మరింత పెరిగింది. కార్యక్రమంలో దొండపాటి బాబు, గారపాటి వెంకటేశ్వరరావు, సుంకవల్లి శ్రీనివాస్, దొండపాటి ముసలయ్య పాల్గొన్నారు.

నేడే ఆఖరు

- నేటి సాయంకాలం 6గంటలతో ఎన్నికల ప్రచారం సమాప్తం
- అప్పటి నుంచే 144 సెక్షన్ అమలు
- నిఘా విభాగం వైఫల్యం
- తనిఖీలు నామమాత్రం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ప్రచారానికి ఒక్కరోజు మాత్రమే మిగిలింది. శనివారం సాయంకాలం 6గంటల వరకూ మాత్రమే గడువు ఉంది. జిల్లాలో ఎన్నికల ప్రచారం హోరెత్తింది. ఇంటింటికీ, వీధివీధికీ ప్రచారం సాగుతోంది. ఒక పక్క ప్రచారం చేస్తూనే ఓట్లు కొనడం మొదలు పెట్టారు. వైసీపీ డబ్బు కన్నా ఎక్కువగా లిక్కర్ పంపిణీ చేస్తోంది. ఇప్పటికే అధికారిక లిక్కర్, షాపులు, బార్ల నుంచి విపరీతంగా తరలించారు. శుక్రవారం మద్యం సిండికేట్లు వైసీపీ నేతలతో సమావేశమయినట్టు సమాచారం. మద్యం పంపిణీ ఎలా చేయాలనే విషయంలో బాగా సమాలోచన చేసినట్టు తెలుస్తోంది. చెక్‌పోస్టులు పెట్టినా తనిఖీ నామమాత్రంగానే సాగుతోంది. కార్లను మాత్రమే తనిఖీ చేస్తున్నారు. సీట్ల కింద ఏమైనా ఉన్నాయా, బ్యాగులు ఏమైనా ఉన్నాయా అనేది వీడియో తీస్తున్నారు. వాహనాల నెంబర్లు నమోదు చేసుకుంటున్నారు. దీంతో జిల్లాలో డబ్బు, లిక్కర్ పంపిణీ యథేచ్ఛగా సాగుతోంది.



మోటారు సైకిళ్లు, ఆటోలు, ఇతర వాహనాలపై కూడా డబ్బు సరఫరా అయింది. ఇప్పటికే గ్రామాలకు చేరిపోయింది. కొన్ని చోట్ల పంపిణీ చేశారు. వైసీపీ రూ.1500 నుంచి రూ.2 వేల వరకూ ఇస్తున్నట్టు



సమాచారం. కొంతమంది పంపిణీ చేయకుండా కాజేస్తున్నట్టు తెలిసింది. ప్రకాశనగర్‌లో ఒక అపార్ట్‌మెంట్‌లో స్లిప్‌లు పంపిణీ చేసి, డబ్బులు వేరే చోట ఇస్తారని చెప్పారని, ఓటర్లు అక్కడకు వెళ్లగా డబ్బు అయిపోయిందని చెప్పినట్టు సమాచారం. 11, 12వ తేదీ రాత్రులంతా ఇదే పనిమీద ఉండడం, ఇతర పార్టీలను పంపిణీ చేయకుండా చూడడం పనిగా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీలు డబ్బులిద్దామనుకున్నా పంచనీయకుండా అడ్డుకునే ప్రయత్నం కూడా వైసీపీ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

బరిలో 95మంది అభ్యర్థులు

జిల్లాలో మొత్తం 95మంది అభ్యర్థులు ఈ సార్వత్రిక ఎన్నికల బరిలో బలాబలాలు నిరూపించుకోనున్నారు. అందులో రాజమహేంద్రవరం పార్లమెంట్ బరిలో 12మంది ఉన్నారు. ఏడు అసెంబ్లీల బరిలో 83 మంది నిలిచారు. ప్రచారం జోరుగా సాగుతోంది. టీడీపీ కూటమి తమ మేనిఫెస్టోతో బాగా ప్రజలకు దగ్గరయింది.

డెల్టా కాలువలకు నీరు నిలిపివేత

ధవళేశ్వరం, మే10: డెల్టా కాలువలకు నీటి నిల్వలు నిలిపివేసి కాల్వలు కట్టివేశారు. శుక్రవారం సాయంత్రం తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాలువల హెడ్‌స్లూయిజ్ గేట్లను పూర్తిగా దించేసి కాల్వలకు నీటి విడుదల నిలిపివేశారు. ఖరీఫ్ చివరి ఆయకట్టు వరకు నీరు పారే విధంగా కాలువల్లో పూడికతీత పనులు, లాకులు, తూముల షెట్టర్ల మరమ్మతులు, వంటి పనులు నిర్వహించి జూన్ మొదటివారం నాటికి నీటిని విడుదల చేయడానికి కాలువలు సిద్ధం చేస్తామన్నారు.

నేటి సాయంత్రం నుంచి 144 సెక్షన్

శనివారం సాయంత్రం 6గంటలతో ఎన్నికల ప్రచారం సమాప్తమవుతుందని, అప్పటి నుంచి 144 సెక్షన్ అమలులోకి వస్తుందని, ఎన్నికలకు మిగిలిన 72 గంటల చాలా కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. శుక్రవారం సాయంకాలం ఆమె జిల్లా కలెక్టరేట్‌లో బరిలో ఉన్న అభ్యర్థులు, వారి ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. ప్రచార గడువు ముగిసిన తర్వాత ఎటువంటి ప్రచారం చేయకూడదన్నారు. ర్యాలీలు, మైక్‌లు ద్వారా, వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా, సినిమా థియేటర్లలో కూడా ప్రచారాలకు అనుమతులు లేవన్నారు. నిశ్శబ్ద సమయంలో వాహనాల అనుమతుల కోసం తిరిగి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అసెంబ్లీ అభ్యర్థులకు 3వాహనాలు, పార్లమెంట్ అభ్యర్థులకు మూడు వాహనాలతోపాటు అసెంబ్లీకి ఒక వాహనం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాటిలో అభ్యర్థి మాత్రమే తిరగాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలవుతుందని, పోలింగ్ కేంద్రానికి 100మీటర్లు, 200 మీటర్లు దూరం నిర్దేశించిన మార్గదర్శకాలు పాటించాలన్నారు. ఓటర్ల స్లిప్‌ల పంపిణీలో కూడా ప్రచారం చేయకూడదని చెప్పారు. నియమావళి ఉల్లంఘిస్తే నోటీసు కూడా ఇవ్వకుండా బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. వారిపై ప్రతి ఎన్ని కల్లో బైండోవర్ కేసులు నమోదు అవుతాయని హెచ్చరించారు. ఎగ్జిట్ పోల్స్ నిషేధమని చెప్పారు. ఓటర్లను మభ్యపెట్టే విధంగా బహుమతులు ఇవ్వడం, కూపన్ల జారీ, నగదు పంపిణీ, వంటి వాటిపై నిఘా పెంచామన్నారు.

● పోలింగ్ కేంద్రానికి సంబంధించి ఒక పోలింగ్ ఏజెంట్ ఇద్దరు రిలీవర్లను నియమించుకోవచ్చన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని, తగిన గుర్తింపు కార్డు ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తామన్నారు. పోలింగ్ ఏజెంట్లకు గుర్తింపుకార్డులు ఆయా ప్రిసైడింగ్ అధికారులు జారీ చేస్తారని కలెక్టర్ చెప్పారు. ఫారం-10 చూపిస్తేనే అనుమతి ఇస్తారన్నారు. అభ్యర్థులకు ఇప్పటికే ఓటర్ల జాబితాలు అందజేసినట్టు తెలిపారు.

పోలింగ్‌బూత్‌ల్లో పటిష్టమైన భద్రత

- ఎన్నికల పోలీసు పరిశీలకుడు బలరాం మీనా

నల్లజర్ల, మే 10: పోలింగ్‌బూత్‌లో వెలుతురు, ఫ్యాన్స్, పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల పోలీసు పరిశీలకుడు బలరాం మీనా సూచించారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. నల్లజర్లలో స్థానిక జడ్పీ హైస్కూల్‌కు చేరుకుని మండలంలోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను, ఇటీవల నల్లజర్లలో జరిగిన దాడుల వివరాలను స్థానిక పోలీసులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే మార్గాలను పరిశీలించారు.

ధైర్యంగా ఓటు వేయండి: ఎస్ఐ

చాగల్లు, మే 10: ప్రజలు ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ పి.నాగరాజు అన్నారు. మండలంలోని బ్రాహ్మణగూడెం, చిక్కాల గ్రామాలలో శుక్రవారం ఓటర్లకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛందంగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. రాజకీయ పార్టీల వారు ప్రలోభాలకు గురిచేసినా, భయపెట్టినా పోలీసులకు తెలియజేయాలని కోరారు.

ఓటర్లకు ఇబ్బంది లేకుండా చూడాలి: ఏఆర్వో

సోమవారం జరిగే సాధారణ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే



నన్నయలో ఓట్ల లెక్కింపు భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్



నల్లజర్లలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్ మీనా

ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని నియోజకవర్గ ఎన్నికల సహాయ అధికారిణి ఎం.సావిత్రి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సిబ్బంది, వీఆర్వోలకు అవగాహన కలిగించారు. మంచినీరు, నీడ కల్పించడానికి షామియాన వంటివి ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి: ఎస్పీ

నన్నయ వర్సిటీలో ఏర్పాట్ల పరిశీలన

దివాన్‌చెరువు, మే 10: కేంద్రఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఓట్ల లెక్కింపునకు అన్నివిధాల తీసుకోవలసిన ఏర్పాట్లను సంబంధిత అధికారులతో కలసి పూర్తిచేసినట్టు జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపునకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో భద్రతాపరంగా ఎటువంటి ఇబ్బందిలేకుండా చేయవలసిన ముందస్తు ఏర్పాటైన రిసెప్షన్ కౌంటర్, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ డైవర్షన్లు, ఆ ప్రదేశాల్లోని సీసీ కెమెరాలు, ఇతర భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలసి శుక్రవారం ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడుషిఫ్టుల్లో పోలీసు భద్రత, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణకు ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, రాజానగరం సీఐ కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

మద్దతివ్వండి.. సమస్యలు పరిష్కరిస్తా

టైటిలింగ్ యాక్టుపై చర్చిద్దాం.. న్యాయవాదులతో పురందేశ్వరి



బార్ అసోసియేషన్‌లో మాట్లాడుతున్న పురందేశ్వరి

రాజమహేంద్రవరం, మే 10(ఆంధ్రజ్యోతి): 'నాకు మద్దతివ్వండి. సమస్యలను పరిష్కరిస్తాను. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలపై కూడా చర్చిద్దాం. రాజ్యాంగబద్ధంగా ముందుకు వెళదాం' అని న్యాయవాదులతో కూటమి రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి, బీజేపీ రాష్ట్రాధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. శుక్రవారం ఆమె రాజమండ్రి బార్ అసోసియేషన్‌కి వెళ్లగా ఘన స్వాగతం లభించింది. బార్ అసోసి యేషన్ తరపున శాలువాతో సత్కరించారు. అనంతరం న్యాయవాదులను ఉద్దేశించి పురందేశ్వరి మాట్లాడారు. ప్రసిద్ధ కవులు, కళాకారులు, వీరేశలింగం వంటి సంఘ సంస్కర్తలు నడయాడిన నేల రాజమహేంద్రవరమని, ఇక్కడి బార్ అసోసియేషన్ చారిత్రాత్మకమైనదని పేర్కొన్నారు. తాను గెలిస్తే బార్ అసోసియేషన్ భవన నిర్మాణంతోపాటు న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. న్యాయవాదులు తన గెలుపునకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్, ఉపాధ్యక్షురాలు స్వర్ణపాప, ప్రధాన కార్యదర్శి పిల్లారి రమేశ్, సంయుక్త కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు, ట్రెజరర్ కర్రా హనుమంతరావు, పుట్రేవు ప్రసాద్, నారాయణ స్వామి, ఎన్‌డీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చర్చిలో పురందేశ్వరి కుమార్తె నివేదిత ప్రార్థనలు

రాజమహేంద్రవరం అర్బన్, మే 10: రాజమహేంద్రవరం క్వారీ రోడ్డులోని బైబిల్ మిషన్ చర్చిలో శుక్రవారం జరిగిన ప్రార్థనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంట్ కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురంధరేశ్వరి కుమార్తె నివేదిత పాల్గొన్నారు. పాస్టర్ నివేదితకు ప్రార్థన చేసి ఆశీర్వదించారు. ఈమెతోపాటు పలువురు నాయకులు హాజరయ్యారు.

వామపక్ష ఇండియా కూటమిని గెలిపించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందరబాబు

కొవ్వూరు, మే 10: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కార్మిక ప్రజా వ్యతిరేక మతోన్మాద బీజేపీని ఓడించి, వామపక్ష ఇండియా కూటమిని గెలిపించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు అన్నారు. శుక్రవారం కొవ్వూరు సీఐటీయూ కార్యాలయంలో రాష్ట్ర కమిటీ ప్రచురించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుందరబాబు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ మద్దతు పలుకుతున్నాయి. రాష్ట్రానికి ఇవ్వాల్సిన ప్రత్యేక హోదా, విభజన హామీలను బీజేపీ అమలు చేయకుండా రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగిస్తుందన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటు వాళ్లకి కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఉద్యమాలపై వైసీపీ నిర్బంధాన్ని ప్రయోగించి, తప్పుడు కేసులు బనాయించిందన్నారు. ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించలేని స్థితికి రాష్ట్రాన్ని జగన్మోహనరెడ్డి ప్రభుత్వం దిగజార్చిందన్నారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టం తీసుకువచ్చి ప్రజల హక్కులను కాలరాస్తోందన్నారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వల్లేపల్లి నరసింహమూర్తి, షైగాపుల నాగేశ్వరరావు, మద్దుకూరి దొరయ్య, బీర రవి, కేకే దుర్గారావు, సుంకర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్ఈబీ దాడుల్లో ఒకరి అరెస్టు

దేవరపల్లి, మే 10: దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో జరిగిన దాడుల్లో గోపాలపురం మండలం వెంకటాయపాలెంలో 12 మద్యంబాటిల్స్ స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ కేవీ స్వామి తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ బి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు

ప్రజల భూములను కాజేసేందుకే

- జగన్మోహనరెడ్డి స్వప్రయోజనాలకే ఈ చట్టం
- కొవ్వూరు కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు



కొవ్వూరులో జీవో ప్రతులను చించివేస్తున్న ముప్పిడి తదితరులు

కొవ్వూరు, మే 10: ప్రజల భూములను కాజేసేందుకే జగన్మోహనరెడ్డి ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని తీసుకువచ్చారని నియోకవర్గ కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొవ్వూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించి ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై నిరసన తెలుపుతూ జీవో ప్రతులను చించివేశారు. రాష్ట్ర ఎన్డీఏ కూటమి పిలుపుమేరకు ల్యాండ్ టైట్లింగ్ చట్టం జీవో ప్రతులను చించివేసి తమ తిరస్కరణను తెలియజేశామన్నారు. ముప్పిడి మాట్లాడుతూ దేశంలో బీజేపీ పరిపాలన చేస్తున్న రాష్ట్రాలతో పాటు ఎక్కడా ల్యాండ్ టైట్లింగ్ యాక్టు అమలు చేయడం లేదు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగు అంశాలను ఎన్నుకున్నాడని, ఇసుక, మద్యం, మైనింగ్, భూములు, గంజాయి, ఎర్ర చందనం, రేషన్‌బియ్యం కొల్లగట్టడం ద్వారా రాష్ట్రంలో రూ.8 లక్షల కోట్లు స్వాహా చేశారన్నారు. లక్షలాది కోట్లు సంపాదించుకోవాలని స్వప్రయోజనాల కోసం ఈ చట్టం తీసుకువచ్చారన్నారు. ఈ పాపపు సొమ్మును భూముల్లోకి తరలించడానికి సివిల్ కోర్టులు అడ్డంకిగా ఉన్నాయని, కోర్టుల రక్షణను తొలగించడానికే రెవెన్యూ అధికారులకు సివిల్ కోర్టుల అధికారాన్ని కట్టబెడుతూ ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో ఖరీదైన భూములపై జగన్మోహనరెడ్డి కన్నేశారన్నారని, ఆ భూములను లాక్కోవడానికి స్వప్రయోజనాల కోసం తీసుకువచ్చిన జీవో 512ను తామే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా న్యాయ నిపుణులు వ్యతిరేకిస్తున్నారన్నారు. ఎందుచేతనంటే తమకు తెలియకుండానే తమ భూములు వేరేవారికి బదలాయింపులు అయిపోతాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారన్నారు. వెంటనే ఈ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొవ్వూరు నియోజకవర్గ పర్యటనలో టీడీపీ అధినేత చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ల్యాండ్ టైట్లింగ్ చట్టాని రద్దు చేస్తామని ప్రకటించారన్నారు. జగన్‌రెడ్డి బినామి కంపెనీ ఇండోసోల్ కంపెనీకి ఒక్క రామాయపట్నం పరిసరాల్లోని 8500 ఎకరాల రైతుల భూములను కారుచౌకగా కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఆస్తులైన సచివాలయాలను, బాండ్లు తాకట్టు పెట్టేశారన్నారు. మన ఆస్తులకు మనం యజమానులుగా ఉండాలంటే జగన్‌ను ఓడించాలన్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓట్లువేసి వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ, మండలాధ్యక్షులు దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, నాయకులు మారిశెట్టి వెంకటేశ్వరరావు, జీవీ ప్రసాద్, జొన్నలగడ్డ శ్రీనివాస్, మద్దిపట్ల సురేష్, ఐటీడీపీ ఇన్‌చార్జి గెల్లా సురేష్ పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా సాగేందుకు సర్వం సిద్ధం

రాజమహేంద్రవరం సిటీ ఆర్వో దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, మే 10: రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం పరిధిలో ఎన్నికలు సజావుగా సాగేందుకు సర్వం సిద్ధం చేశామని ఆర్వో దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక ఆర్వో కార్యాలయంలో శుక్రవారం సెక్టార్ అధికారులు, ఐటీ టీమ్‌లు, అన్నివిభాగాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకొన్న వారి వివరాలను ఎలక్టోరోల్‌లో సక్రమంగా నమోదు చేసి తగినన్ని మార్క్డ్ కాపీ ఆఫ్ ఎలక్టోరోల్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ చేసే రోజున ఎన్నికల సంఘం నిర్దేశించిన బీఎల్‌వో యాప్, సువిధ యాప్‌లను సబంధిత సిబ్బంది ఉదయం 9గంటలలకు పూర్తి చేయాలన్నారు. శనివారానికి ఎన్నికల సామగ్రి పోలింగ్ స్టేషన్ల వారీగా విడదీసుకుని పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. ఎస్‌కేవీటీ డిగ్రీ కాలేజీలో ఈనెల 12న ఎన్నికల సామగ్రి పంపిణీకి, పోలింగ్ అనంతరం 13న రాత్రికి నన్నయ యూనివర్శిటీలో తిరిగి తీసుకోవడానికి కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ స్టేషన్లలో ఎన్నికల సంఘం నిర్దేశించిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఈఈ ఆర్.శేషగిరిరావును ఆదేశించారు. వెబ్ కాస్టింగ్‌కు తగిన ఏర్పాట్లు చేసే బాధ్యతను ఈఈ మదర్షా అలీకి అప్పగించారు. ఎన్నికల సిబ్బందికి ఈనెల 12,13 తేదీల్లో అల్పాహారం, భోజనాలు ఏర్పాటు చేయాలని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వినూత్నను ఆదేశించారు. వీటన్నింటిని పర్యవేక్షించే బాధ్యతను ఎస్ఈ జి.పాండురంగారావు, అదనపు కమిషనర్ పీఎం సత్యవేణిలకు అప్పగించారు.

ఎస్ఈబీ దాడుల్లో ఒకరి అరెస్టు

దేవరపల్లి, మే 10: దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో జరిగిన దాడుల్లో గోపాలపురం మండలం వెంకటాయపాలెంలో 12 మద్యంబాటిల్స్ స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ కేవీ స్వామి తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ బి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



నిడదవోలులో ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గిడుగు

రాజమహేంద్రవరం సిటీ, మే 10: భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని దేశంలోను, రాష్ట్రంలోను పరిరక్షించాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే మార్గమని ఆ పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. శుక్రవారం నిడదవోలులో ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి సుబ్బారావుతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీవెళ్లి మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. అనంతరం సుబ్బారావు ఆధ్వర్యంలో వస్త్రావ్యాపారులతో గిడుగు భేటీ అయ్యారు. మధ్యాహ్నం స్థానిక మసీదు పెద్దలు ఇమామ్‌లతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గిడుగు రుద్రరాజు పదేళ్ల బీజేపీ పాలనలో ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, రాష్ట్రానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేశాయన్నారు. విభజన హామీలు, ప్రత్యేక హోదా వంటివాటిని నేరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా పాటు విభజన హామీలు నెరవేర్చుతారని, పోలవరాన్ని పూర్తి చేస్తామని, ప్రభుత్వ రంగ సంస్థలను రక్షిస్తారని, కేజీ టూ పీజీ విద్య, వైద్యం, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాలు సమర్థవంతంగా అమలు చేస్తారని, కాంగ్రెస్ అభ్యర్థులను హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

అధికారంలోకి రాబోయేది కూటమి ప్రభుత్వమే

టీడీపీ-జనసేన-బీజేపీ నిడదవోలు అభ్యర్థి దుర్గేష్.. పలుచోట్ల ఎన్నికల ప్రచారం



కాటకూటేశ్వరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్

నిడదవోలు, మే 10: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని టీడీపీ -జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. శుక్రవారం నిడదవోలు మండలం తాడిమళ్ల, కాటకూటేశ్వరం, ఉనకరమిల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పరిచేందుకు మోదీ సహకారం, చంద్రబాబు అనుభవం, పేదలకు సేవ చేయాలనే పవన్‌కల్యాణ్ లక్ష్యంతోనే తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయన్నారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి ఏక కాలంలో జరగాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ప్రతిఒక్క రూ రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఓటు వేయాల న్నారు. కార్యక్రమంలో మూడు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: కూటమి అభ్యర్థులకు మద్దతుగా మండలంలోని ఉండ్రాజవరం, వేలివెన్ను, దమ్మెన్ను తదితర గ్రామాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో మరలా అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నియోజకవర్గ కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్, పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరిలను గెలిపించాలని కోరారు. రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు రావాలని వారు ప్రచారం చేశారు. ప్రస్తుత పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో తిరోగమనంలోకి వెళ్లిందని నాయకులు వివరించారు.